www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శుక్రవారం | 05 | జూన్ | 2026 పేజీలు : 8

## నేడు బోనకల్ మండలంలో కూనంనేని పర్యటన



**ప్రజాపక్షం/ ఖమ్మం :** సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు శుక్రవారం బోనకల్ మండలంలో పర్యటించనున్నారు. బ్రాహ్మణపల్లి గ్రామంలో జరిగే సిపిఐ జనరల్ బాడీ సమావేశానికి ముఖ్య అతిథిగా కూనంనేని హాజరుకానున్నారు. మండలంలో పలు గ్రామాల్లో పర్యటించి సిపిఐ నాయకులను, కార్యకర్తలను కూనంనేని కలవనున్నారు. బ్రాహ్మణపల్లిలో జరిగే జనరల్ బాడీ సమావేశంలో కూనంనేనితో పాటు సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు ఏనుగు గాంధీ, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు బత్తినేని నీరజ, జిల్లా కౌన్సిల్ సభ్యులు తూము రోషన్‌కుమార్, రాము తదితరులు పాల్గొననున్నారని సిపిఐ మండల కార్యదర్శి వెంగళ ఆనందరావు తెలిపారు.

# ప్రైవేటు జోరు.. ప్రభుత్వ విద్యా సంస్థల బేజారు..!

**-అంతంత మాత్రంగానే బడిబాట**
**-అల్పాహారం ప్రకటించిన రాని సానుకూలత**
**-విస్తృత ప్రచారంలో ప్రైవేటు విద్యా సంస్థలు**




**ప్రజాపక్షం/ ఖమ్మం :** ప్రైవేటు విద్యా సంస్థల జోరు ముందు ప్రభు త్వం చేపట్టిన బడిబాట వెలవెలబోతున్నది. ప్రభుత్వ విద్యా సంస్థలు విశ్వాసం కోల్పోవడం, విద్యార్థుల తల్లిదండ్రుల్లో ప్రైవేటుపై ఉన్న మో జు ముందు ప్రభుత్వం ప్రకటించిన అల్పాహారం కూడా విద్యార్థుల తల్లిదండ్రులను ప్రభుత్వ సంస్థల వైపు చూసేలా చేయలేకపోతుంది. ప్రైవే టు విద్యా సంస్థలు గడిచిన 10 రోజులుగా విస్తృత ప్రచారం నిర్వహి స్తూ జోరు మీద ఉన్నాయి. బుధవారం నుంచి ప్రభుత్వం బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించింది. గ్రామాలు, పట్టణాలు అనే తేడా లేకుండా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు తల్లిదండ్రులు సుముఖత వ్యక్తం చేయడం లేదు. రెండువేల జనాభా కలిగిన గ్రామంలో వందల సంఖ్యలో బడిఈడు పిల్లలు ఉంటే 30 నుంచి 40 మందికి మించి ప్రభుత్వ పాఠశాలల్లో చేరడం లేదు. ప్రైవేటు విద్యా సంస్థలకు చెందిన బస్సులు మాత్రం గ్రామాల నుంచి మిగతా 2లో..



## కాలుష్య కోరల్లో భూమి



**- పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, తగ్గుతున్న పచ్చదనం**
**- పర్యావరణ పరిరక్షణలో అంతా భాగస్వాములు కావాలి**
**- నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** పర్యావరణం నేడు పెద్ద ప్రశ్నార్థకంగా మారింది. పచ్చదానికి కేరాఫ్ అడ్రస్‌గా ఉండే ప్రాంతాలు నేడు కాలుష్య కోరల్లో మగ్గుతున్నాయి. ఆధునిక అభివృద్ధి పేరుతో ప్రకృతిపై జరుగుతున్న దాడులు భూమి మనుగడకే ముప్పుగా మారాయి. అడవుల నరికివేత, ప్లాస్టిక్ కాలుష్యం, పరిశ్రమల వ్యర్థాలు, వాహనాల నుండి వెలువడే పొగల కారణంగా పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోంది. గత కొన్నేళ్లుగా భూతాపం పెరగడం, ఎండల తీవ్రంగా ఉండటం, అసాధారణ వర్షాలు, వరదలు, కరువులు తరుచూ సంభవిస్తూ ఉండటం పర్యావరణ అసమతుల్యతకు నిదర్శంగా నిలుస్తోంది. ఈ ఏడాది వేసవిలో ఏకంగా 48 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ప్రకృతిని నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్ తరాలకు తాగునీరు, స్వచ్ఛమైన గాలి కూడా మిగతా 2లో..

## పోలవరంతో భద్రాద్రికి ముప్పే..



**-అంచనాలకు మించి ముంపు**
**-కరకట్టల నిర్మాణం జరగకపోతే మరింత నష్టం**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** పోలవరం ప్రాజెక్టు నుంచి భద్రాచలం పట్టణంతో పాటు పారిశ్రామిక ప్రాంతమైన సారపాకకు ఇంకా ఎగువన ఉన్న గోదావరి పరివాహక ప్రాంతానికి ముంపు ప్రమాదం పొంచి ఉంది. గతంలో నిపుణుల అంచనా మేరకు ఉన్న ముంపు కంటే పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. 2021 22 సంవత్సరాల్లో వచ్చిన గోదావరి వరదలు కానీ, 2021 నుంచి 2025 వరకు నమోదైన వరద ప్రవాహం ముంపు ప్రాంతాన్ని పరిశీలిస్తే ఈ విషయం అవగతమవుతుంది. అదృష్టవశాత్తు గడిచిన మూడేళ్లుగా గోదావరికి వరదలు వచ్చిన ప్రతి సమయంలోనూ భద్రాచలం ప్రాంతంలో వర్షం లేకపోవడం కొంత మేర సానుకూలంగా మారింది. పోలవరం ముంపు కారణంగా భద్రాచలం పట్టణంతో పాటు పారిశ్రామిక ప్రాంతమైన సారపాక లోని ఐటిసి పేపర్ బోర్డ్, అశ్వాపురం హెవి వాటర్ ప్లాంట్, దుమ్ముగూడెం ఐడెల్ ప్రాజెక్టు ప్రాంతాలు కూడా ముంపుకు గురయ్యే అవకాశం ఉందని గతంలో వచ్చిన వరదలను బట్టి అంచనా వేస్తున్నారు. గతంలో పోలవరం ముంపు అంచనా వేసిన సమయంలో ప్రస్తుత బూర్గంపాడు మండలంలోని చాలా ప్రాంతాలను, గ్రామాలను ముంపు నుంచి మినహాయించారు. కానీ ఇప్పుడు మిగతా 2లో..

# ప్రైవేటు జోరు..ప్రభుత్వ విద్యా సంస్థల బేజారు..!

(మొదటిపేజీ తరువాయి)
పెద్ద సంఖ్యలో విద్యార్థులను తమ విద్యాలయాలకు తరలిస్తున్నాయి.

### విశ్వసనీయత కోల్పోయిన ప్రభుత్వ విద్య ..

ప్రభుత్వ విద్యా సంస్థలు విశ్వసనీయతను కోల్పోయి. ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తే చదువు రాకపోగా పిల్లలు దారి తప్పుతారన్న భావన బలంగా ప్రజల్లో నాటుకుంది. దీనికి తోడు గ్రామాల్లో ఉండే మోతుబారులు, ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించకపోవడం ప్రభుత్వ ఉపాధ్యాయుల పిల్లలు కూడా ప్రైవేటు విద్యా సంస్థల్లోనే విద్యా భ్యాసం చేస్తుండడంతో ప్రభుత్వ విద్యా సంస్థలు క్రమేపి విశ్వసనీయతను కోల్పోయాయి. ఫలితాలు కూడా ప్రైవేటు విద్యా సంస్థలే ఘనంగా సాధిస్తుండటం ప్రభుత్వ విద్యా సంస్థలు వెనకబడటం ఇందుకు ఊతమిస్తుంది. ప్రైవేటు విద్యా సంస్థలతో పోల్చి చూసినప్పుడు ప్రభుత్వ ఉపాధ్యాయులు అన్ని విధాలా శిక్షణ పొంది బోధనకు సంబంధించి అత్యున్నత అర్హత కలిగి ఉన్నారు. అరకొర చదువులతో ప్రైవేటు పాఠశాలల్లో విద్యా బోధన చేసే వారికంటే ప్రభుత్వ ఉపాధ్యాయులు కొన్ని రేట్లు అనుభవం కూడా కలిగి ఉన్నారు. అయినా తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల వైపు చూడటం లేదు. కొందరు ప్రభుత్వ ఉపాధ్యాయుల నిర్వాకం కారణంగా ప్రభుత్వ విద్యా సంస్థల్లో బోధన సరిగ్గా చేయరన్న అపవాదును మూటకట్టుకుంటున్నాయి. రియల్ ఎస్టేట్, చిట్ ఫండ్ వ్యాపారాలు నిర్వహించడం సరైన సమయానికి పాఠశాలలకు రాకపోవడం, మండల, జిల్లా విద్యాశాఖాధికారుల పర్యవేక్షణ కొరవడటం ఈ పరిస్థితికి కారణమవుతుంది. ఇక పాఠశాలల పరిస్థితిఇలా ఉంటే గురుకుల విద్యాలయాల్లోనూ సీట్లు భర్తీ కాని పరిస్థితి ఏర్పడింది. గత ప్రభుత్వంతో పోల్చి చూసినప్పుడు ప్రస్తుత ప్రభుత్వం విద్యాపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించడంతో పాటు అన్ని విధాలా ప్రోత్సహిస్తున్న అడ్మిషన్ల పరంగా మెరుగైన ఫలితాలు సాధించలేకపోతున్నారు. మౌలిక వసతుల కల్పన సరైన రీతిలో లేకపోవడం కూడా ఒక కారణంగా భావిస్తున్నారు. రెండవది అత్యధిక ఫీజు చెల్లించి ప్రైవేటు పాఠశాలల్లో చదివించడమనేది తల్లిదండ్రుల్లో ఒక ఫ్యాషన్‌గా మారింది. ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థులను పంపే తల్లిదండ్రులను హీనంగా చూసే పరిస్థితి ఏర్పడింది. ఏమిటి ప్రభుత్వ బడికి పంపుతున్నారా అని అవహేళన చేస్తుండడంతో ఆర్థికంగా ఇబ్బంది ఉన్న తలకు మించిన భారమే అయినా ప్రైవేటు పాఠశాలలకు తప్పక పంపించే కుటుంబాలు పెద్ద సంఖ్యలో ఉన్నాయి. ప్రభుత్వం చేపట్టిన బడిబాట కార్యక్రమంలో చిత్తశుద్ధి లేదు. ఉపాధ్యాయులు మొక్కుబడిగా ఏదో చేశాం అని చెబుతున్నారు తప్ప గ్రామాల్లో ఉన్న విద్యార్థుల తల్లిదండ్రుల వద్దకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలల ఘనతను వివరించలేకపోతున్నారు. ఒక ఫ్లేక్సీ ఏర్పాటు చేసి ఫోటో దిగడంతో మూడొంతుల మంది ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని ముగించేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలంటే ప్రభుత్వాలు కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. మా పిల్లలు ప్రైవేటు స్కూల్‌లో ఉన్నారు మీ పిల్లలను మా బడికి పంపించండి అని ఉపాధ్యాయులు అడిగితే తల్లిదండ్రులు ముఖం మీదనే ఇదేం పని అని ప్రశ్నిస్తున్నారు. అందుకే ప్రజాప్రతినిధులను, స్థానిక అధికారులను ప్రభుత్వ విద్య బలోపేతంలో భాగస్వాములను చేయాల్సి ఉంది. ఉపాధ్యాయ సంఘాలు సైతం బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. రోజు రోజుకు ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలహీనపడటం కారణంగా ఇప్పటికే ఉపాధ్యాయ నియామకాలు తగ్గిపోయాయి. రానున్న కాలంలో ఇదే పరిస్థితి కొనసాగితే ప్రభుత్వ ఉపాధ్యాయ వ్యవస్థ భవిష్యత్తే ప్రశ్నార్థకమవుతుంది. అందుకే ఉపాధ్యాయ సంఘాలు సంక్షేమం, హక్కుల కోసం కొట్లాడుతూనే ప్రభుత్వ విద్యా పరిరక్షణ కోసం కృషి చేయాల్సి ఉంది. కొందరు ఉపాధ్యాయులు మొత్తం వ్యవస్థను భ్రష్టు పట్టించే విధంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో అటువంటి వారిపై చర్యలను ఉపాధ్యాయ సంఘాలు ప్రోత్సహించడంతో పాటు బడిఈడు పిల్లలను బడిలో చేర్పించేందుకు ఉపాధ్యాయ సంఘాల నేతృత్వంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించాల్సి ఉంది. లేదంటే ప్రభుత్వ విద్య గతంగా మారి భవిష్యత్తు తరాలు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉంది.

# పోలవరంతో భద్రాద్రికి ముప్పే..

(మొదటిపేజీ తరువాయి)
పరిస్థితులను అధ్యయనం చేస్తున్న సాంకేతిక బృందానికి బూర్గంపాడు మండలంలోని పలు గ్రామాలు గోదావరి పరివాహక ప్రాంతం ముంపుకు గురయ్యే అవకాశం ఉందని తెలుస్తుంది. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భద్రాచలం రక్షణకు ఇప్పుడు ఉన్న కరకట్టలను మరింత పెంచడంతో పాటు కరకట్టలు దాటిన తర్వాత వెనక్కి వచ్చే వరద నీటి నుంచి భద్రాచలంను రక్షించేందుకు కరకట్టలను మరో ఐదు కిలో మీటర్ల మేర పెంచాల్సి ఉంది. భద్రాచలానికి ఎగువ, దిగువ ప్రాంతాల్లో కరకట్టల పొడవు పెంచడంతో పాటు భద్రాచలంలో వాటర్ పంపింగ్ స్టేషన్లు నిర్మించాల్సి ఉంది. భద్రాచలంలో వర్షపు నీటిని గోదావరిలోకి ఎత్తిపోసేందుకు ఒక ప్రత్యేక వ్యవస్థను రూపొందించకపోతే ప్రసిద్ధ దేవాలయం ముంపుకు గురికాక తప్పదు.

# ప్రజల అవసరాలకనుగుణంగా పనులు చేపట్టాలి : అదనపు కలెక్టర్ శ్రీజ



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం సిరిపురం గ్రామంలో జరిగిన ఖమ్మం లోకల్ బాడీ అదనపు కలెక్టర్ శ్రీజ పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్ శెట్టిపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన గ్రామసభలో అదనపు కలెక్టర్ శ్రీజ మాట్లాడుతూ 99 రోజుల ప్రజాపాలన ప్రగతి కార్యక్రమంలో భాగంగా అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలను అందిస్తుందని ఆమె తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా పనులను అధికారులు గుర్తించి వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. ఈ గ్రామసభకు గ్రామంలో పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి వారి వినతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధికారి సక్రియ, తహశీల్దార్ సురేష్, ఎంఈవో చావా శ్రీనివాసరావు, ఏపిఎం రాంబాబు, విద్యుత్ అధికారులు, ఇరిగేషన్ ఆర్‌డబ్ల్యూస్ అధికారులతో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వెరా టౌన్ ప్లానింగ్‌లో కళా భాస్కరుడు






**ప్రజాపక్షం/వైరా:** 64 కళల్లో వాస్తు నిర్మాణ కళ ఒకటి. అందులో సిద్ధహస్తుడు వైరా మున్సిపాలిటీలో పనిచేసిన టౌన్ ప్లానింగ్ అధికారి ఇటికాల భాస్కర్. నిర్మాణం మొదలు పెట్టక ముందే దాని రూపాన్ని ముందుగానే ఊహించి దాని ఫొటోను 3డిలో తయారు చేయడంలో ఆయన సిద్ధహస్తుడు. దాని ద్వారా నిర్మాణానికి ముందే నిర్మించే వారికి ఒక అవగాహన వస్తుంది. సుతారికి కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. వివిధ రకాల కంప్యూటర్ సాఫ్ట్‌వేర్‌తో ఇలాంటి అద్భుతాలు సృష్టిస్తారు ఇటికాల. ఇటీవల 99 రోజుల ప్రజాపాలన సమావేశ కార్యక్రమం వైరా గాంధిచౌక్ ప్రాంతంలో గాంధి బొమ్మ ఉన్న చోట జరిగింది. ఎంతో చారిత్రక ప్రాధాన్యం ఉన్న గాంధి బొమ్మ దగ్గర పార్క్‌ను అభివృద్ధి చేయాలని 12వ వార్డు కౌన్సిలర్ మాదినేని సునీత కోరడంతో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కాపా చంద్రకళ ఆ సమావేశంలో టౌన్ ప్లానింగ్ అధికారి ఇటికాల భాస్కర్‌కు డిజైన్‌లు తయారు చేయమని సూచించారు. దీంతో పాటు వందేళ్ల చరిత్ర గల వైరా రిజర్వాయర్ దగ్గర సందర్శకుల కోసం ఓ సెల్ఫీ పాయింట్‌ను కూడా డిజైన్ చేశారు. వీటికి సంబంధించిన డిజైన్‌లను తయారు చేసి ఇటీవల చైర్మన్‌కి డిజైన్ ప్రింట్ కాపీలనును ఇటికాల అందించారు. ఈ డిజైన్ క్షేత్రస్థాయిలో నిర్మించడానికి సాధ్యాసాధ్యాలను పరిశీలించడానికి కమీషనర్ రామచంద్రరావు, కౌన్సిలర్ మాదినేని సునీత, మాజీ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు, డాక్టర్స్ సెల్ చైర్మన్ కాపా మురళీలు గాంధి విగ్రహ పరిసరాలను పరిశీలించారు.

# కాలుష్య కోరల్లో భూమి

(మొదటిపేజీ తరువాయి) దొరికని పరిస్థితులు దాపురించ నున్నాయని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### పచ్చదనమే భవిష్యత్‌కు భరోసా...

పర్యావరణ పరిరక్షణ ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదు. ప్రతీ పౌరుని కర్తవ్యం కూడా. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం మొక్కలు నాటడం నీటి సంరక్షణ, చెత్త నిర్వహణ వంటి చిన్న చిన్న చర్యలు భూమి భవిష్యత్‌ను కాపాడగలవు.

### ఒక మొక్క రేపటి తరాలకు ప్రాణవాయువు...

నాటే ప్రతీ ఒక మొక్క రేపటి తరాలకు ప్రాణవాయువు అనే నినాదంతో ఈ ఏడాది ప్రపంచ పర్యావరణ దినత్సోవం జరుగుతోంది. ఇందుకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇప్పటికే జిల్లాలో 63 శాతం అడవులు ఉండగ వాటిని మరింత పెంచేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 50 లక్షల మొక్కలను నాటాలేన సంకల్పంతో అధికారులు ముందుకు సాగుతున్నారు. పచ్చని ప్రకృతిని కాపాడితేనే మానవ జాతి మనుగడ సురక్షితంగా ఉంటుంది. ప్రకృతిని పరిరక్షిస్తే ప్రాణాధారం అవుతుంది, లేదంటే వినాశనానికి దారితీస్తుంది. అందుకే ఆ భయంకర విపత్తు నుండి బయటపడేందుకు ప్రతీ ఒక్కరం తలా ఒక మొక్కను నాటుదాం, ముందు తరాలకు సరైన ఆక్సిజన్‌ను అందిద్దాం. ఇదే వారికి మనమిచ్చే గొప్ప సంపద.

### నేడు కోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమం...

పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా నేడు జిల్లా కోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అనంతరం జిల్లా కోర్టు ఆవరణ నుండి పోస్టాఫీస్ సెంటర్ వరకు ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించనున్నారు.

# ఘనంగా వంశీ చందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలో ఇందిరమ్మ కాలనీ నందు భారత కాంగ్రేస్ కమిటీ వర్కింగ్ కమిటీ సభ్యులు, ఏఐసిసి కార్యదర్శి మాజీ కల్వకుర్తి ఎమ్మెల్యే వంశచంద్‌రెడ్డి జన్మదిన వేడుకలు వైరా మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కట్ల సంతోష్ మాట్లాడుతూ వంశీచంద్‌రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నందు కాంగ్రేస్ పార్టీ విద్యార్థి విభాగం ఎన్‌ఎస్‌యుఐ, యువజన కాంగ్రేస్ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసి కాంగ్రేస్ పార్టీ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని వారి నాయకత్వంలో అప్పటి ప్రభుత్వాలకు వ్యతిరేకంగా విద్యార్థి, యువజన ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడి ఎన్నో ఉద్యమాలు వారి నాయకత్వంలో పనిచేసే అదృష్టం మా అందరికి లభించిందని ఆయన పేర్కొన్నారు. అనంతరం కల్వకుర్తి ఎమ్మెల్యే ఎమ్మెల్యేగా ఏఐసిసి కార్యదర్శిగా ప్రస్తుతం కాంగ్రేస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు వరకు పార్టీలో ఎదుగుతూ పార్టీ ఆదేశాలను క్రింద స్థాయి కార్యకర్తల వరకు తీసుకెళతారని, భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు వారు అవరోధించాలని ఆయన పేర్కొన్నారు. ఈ జన్మదిన వేడుకల్లో కాంగ్రేస్ పార్టీ నాయకులు ముదిగొండ మహేష్, దారకాని చంద్ర, మునగాల ప్రవీణ్, తిగారపు అరుణ, నోచిన లలిత, దుగ్గిరాల లక్ష్మి, ఇందిరమ్మ కాలనీవాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# వరదల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమీక్ష



**ప్రజాపక్షం/వైరా:** వరదల నేపథ్యంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై కమీషనర్ రామచందర్‌రావు, ఎమ్మార్వో సురేష్, ఎస్సై రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వరద పరిస్థితులపై సన్నద్ధత, అత్యవసర సేవల సమన్వయంగా, ప్రజల భద్రత కోసం తీసుకోవాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కాపా మురళీకృష్ణ, ఏఈ శ్రీమాన్య, సుధీర్ పాల్గొని తమ సూచనలు తెలియజేశారు.

# ఇండోర్ స్టేడియం ఆధునీకరణకు ఏర్పాట్లు



**ప్రజాపక్షం/వైరా:** వైరాలోని రింగు రోడ్డు వద్ద ఉన్న ఇండోర్ స్టేడియాన్ని ఆధునీకరణలో భాగంగా గురువారం జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారి సునీల్‌రెడ్డి వైరా ఏసిపి సారంగపాణి, చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ, వైస్ చైర్మన్ కట్ల సంతోష్, మున్సిపాల్ కమీషనర్ రామచంద్రరావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా నిరుపయోగంగా ఉన్న టెన్నిస్ కోర్టును క్రికెట్ నెట్ ప్రాక్టీస్ చేసేందుకు ఏర్పాటు చేయడం, ఓపెన్ జిమ్ ఆధునీకరణ పనులు చేపట్టడం, గురుకుల పాఠశాల విద్యార్థులను ఇండోర్ స్టేడియంలో ప్రాక్టీస్ చేసే విధంగా చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆయన అన్నారు. త్వరలోనే ఇండోర్ స్టేడియాన్ని ఆధునీకరణ చేపట్టి క్రీడాకారులకు అందుబాటులో ఉండేవిధంగా చర్యలు చేపట్టడం జరిగిందని ఆయన తెలిపారు. వాటికి కావాల్సిన ఏర్పాట్లను త్వరలోనే చేసేవిధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ప్రభుత్వం క్రీడా రంగానికి పెద్ద పీఠ చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కాంగ్రేస్ మెడికల్ అండ్ హెల్త్ అధ్యక్షులు డాక్టర్ కాపా మురళీకృష్ణ, మార్కెట్ చైర్మన్ బోళ్ళ గంగారావు, సిఐ ప్రసాద్, ఎస్సై రామారావు తదితరులు పాల్గొన్నారు.

# వనమా విశ్వేశ్వరరావుకు సన్మానం



**ప్రజాపక్షం/వైరా:** తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమితులైన వనమా విశ్వేశ్వరరావును వైరాలో ఆయన నివాసం నందు వైరా నియోజకవర్గ బిఆర్ఎస్ నాయకులు బాదావత్ బాలాజి మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. శాలువా కప్పి గనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వనమా విశ్వేశ్వరరావు మాట్లాడుతూ మరెన్నో పదవులు చేపట్టి ప్రజలకు సేవలు అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యండ్రాతి మోహన్‌రావు, భూక్యా బాలాజి, వజినేపల్లి చక్రవర్తి తదితరులు ఉన్నారు.

# భవిష్యత్తు తరాల కోసం పర్యావరణాన్ని కాపాడుకుందాం




## గోళ్లపాడు గ్రామ సభలో కలెక్టర్ దివాకర టిఎస్



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : భవిష్యత్తు తరాల కోసం మనమందరం పర్యావరణాన్ని కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. గురువారం ఖమ్మంరూరల్ మండలం గోళ్లపాడులో గ్రామం లోని రైతు వేదికలో నిర్వహించిన గ్రామ సభలో జిల్లా కలెక్టర పాల్గొని ప్రజలతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...గ్రామ, వార్డు సభలు ప్రభుత్వ సంక్షేమ, అభి వృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేసే ముఖ్య వేదికలన్నారు. ఎస్.ఐ.ఆర్ కార్యక్రమంపై సమగ్ర వివరాలు తెలియజేసి, ప్రజలు అడి గిన సందేహాలను నివృత్తి చేశారు. ఇరిగేషన్ శాఖకు సంబంధించిన కాలువల అభివృద్ధి, సాగునీటి పనుల పురోగతిపై గ్రామస్తులతో చర్చిం చారు. రాబోయే ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఎరువుల కొరత తలెత్త కుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని తెలిపారు. నానో యూరియా వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు. పంటల మార్పిడి విధానంపై రైతులకు అవగాహన కల్పిస్తూ, వాతావరణశాఖ అంచనాలను దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయ పంటలైన ఆయిల్ ఫామ్, కూరగాయలు, పండ్ల తోటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులు తక్కువగా ఉన్న నేపథ్యంలో బోర్ వెల్ సౌకర్యం కలిగిన రైతులు షార్ట్ డ్యూరేషన్ వరి సాగు చేపట్టవచ్చని తెలిపారు. పంటలకు రసాయన ఎరువులు, పురుగుమందుల వినియో గాన్ని తగ్గించి సేంద్రీ వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచిం చారు. గ్రామాలలో చెత్తను సమర్థవంతంగా నిర్వహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. రోజురోజుకూ పెరుగుతున్న జనాభా నేపథ్యంలో పర్యావరణ కాలుష్యం పెరుగుతోందని, ప్రస్తుతం స్వచ్ఛమైన తాగునీటి కోసం డబ్బులు చెల్లిస్తున్నామని భవిష్యత్తులో స్వచ్ఛమైన గాలి కోసం కూడా డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి రాకుండా పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని సూచించారు. భవి ష్యత్ తరాలు మెరుగైన జీవనం సాగించాలంటే పర్యావరణ పరిరక్షణ అత్యంత ముఖ్యమని అన్నారు. వాతావరణ మార్పుల ప్రభావంతో ఒకే రోజు కుంభవృష్టి తరహా వర్షాలు కురిసి వరదలు సంభవిస్తున్నాయని, అడవుల నరికివేత కారణంగా కోతులు జనావాసాల్లోకి వస్తున్నాయని తెలిపారు. కోతుల సమస్యకు తక్షణ పరిష్కారం లేదని, గ్రామస్థులు తమ జీవన విధానంలో మార్పులు చేసుకుంటేనే శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. జిల్లాకు సమగ్ర విపత్తు నిర్వహణ ప్రణాళిక సిద్ధం చేయాల్సిన అవసరాన్ని వివరించిన కలెక్టర్, రాబోయే వర్షాకా లన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో మురుగు కాల్వల శుభ్రత, పరిస రాల పరిశుభ్రత, నీటి సంరక్షణ చర్యలు, కమ్యూనిటీ సోక్‌పిట్ల నిర్మాణం వంటి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. వరదల సమయంలో ప్రజలు ప్రభుత్వ యంత్రాంగానికి సహకరించి లోతట్టు ప్రాంతాల నుంచి వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాని సూచించారు. జూన్ 25నుంచి జూలై 24వరకు బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి వెళ్లి మిగిలిన ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలు అందజేస్తారని తెలిపారు. ప్రజలు తమ వివరాలను నమోదు చేసి ప్రభుత్వం గుర్తించిన 11గుర్తింపు పత్రాల్లో ఏదో ఒక దానిని జత చేసి సమర్పించాలని సూచించారు. జూలై 31, 2026న డ్రాఫ్ట్ ఎస్.ఆర్ ఓటరు జాబితా విడుదల చేస్తామని తెలిపారు. ప్రతి ఓటరు తన పేరు డ్రాఫ్ట్ జాబితాలో ఉందో లేదో పరిశీలించాలని అభ్యంతరాలు ఫిర్యా దులు, కొత్త క్లెయిమ్‌లు ఉంటే ఆగస్టు 30లోగా సమర్పించాలని సూచిం చారు. జూలై1,1987కు ముందు భారతదేశంలో జన్మించిన వారు తమ స్వీయ గుర్తింపు లేదా? జనన ఆధార పత్రాలు సమర్పిస్తే సరిపోతుం దని, జూలై 1,1987నుంచి డిసెంబర్ 2,2024 మధ్య జన్మించిన వారు తమ పత్రాలతో పాటు తండ్రి లేదా తల్లి ఎవరు అయినా ఒకరి పత్రం సమర్పించాలని తెలిపారు. డిసెంబర్ 2,2024 తర్వాత జన్మించిన వారు తండ్రి, తల్లి ఇద్దరి పత్రాలు సమర్పించాల్సి ఉంటుందని వివరించారు. సెప్టెంబర్ 28,2026 నాటికి అన్ని అభ్యంతరాలు, క్లెయిమ్‌లను పరిష్కరించి, అక్టోబర్ 1,2026న తుది ఓటరు జాబితాను విడుదల చేస్తామని జిల్లా కలెక్టర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ బి. జ్యోతి, ఆత్మ పిడి బి.సరిత, ఏఓ ఉమానగేష్, పశువైద్యులు జగ్గలాల్ సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# రేపు జాబ్‌మేళా నిర్వహణ

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఉమ్మడి ఖమ్మంజిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేటు రంగం ఖమ్మం నేషనల్ మార్ట్‌లో ఉద్యోగాలు కల్పించుటకు ఈనెల ఆరున జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారిణి ఎన్. మాధవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు ఖమ్మం ఇల్లందు క్రాస్ రోడ్డులోని టిటిడిసిలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. హ్యూమన్ రిసోర్స్ (మేల్) ఉద్యోగానికి ఎంబిఏ హెచ్ఆర్ అర్హత గల వారు, క్యాషియర్, సిఎస్ఏ, సిఎస్ఆర్ ఉద్యోగాలకు పురుష, మహిళా అభ్యర్థులు ఎస్ఎస్‌సి ఉత్తీర్ణత కలిగి ఉండాలని, 27 సంవత్సరాల లోపు వయస్సు గల వారు అర్హులని తెలిపారు. మొత్తం 40 ఉద్యోగ ఖాళీల భర్తీకి గాను జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇట్టి ఉద్యోగ ఖాళీలు ఖమ్మంలో ఉన్నాయని ఆసక్తి గల నిరుద్యోగ యువతీ, యువకులు తమ విద్యార్హతల సర్టిఫికెట్లతో జాబ్‌మేళాకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు హెచ్ఆర్ సెల్ నెం. 7337444265 నందు సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి తెలిపారు.

# పలు డివిజన్లలో సభలు



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలోని పలు డివిజన్లలో సభలు నిర్వహించారు. గురువారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని ఒకటి, మూడు, నాలుగు, ఏడు, తొమ్మిది, 11, 12, 14, 16, 17, 19, 22, 24, 25, 28 డివిజన్లలో సభలు నిర్వహించారు. ఈ సభలకు స్థానిక ప్రజలు హాజరై తమ సమస్యలు, వినతులను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అధికారులు, వార్డు ఆఫీసర్లు సభల్లో పాల్గొని ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ పలు డివిజన్లలో పర్యటించి సభలను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను సంబంధిత శాఖలకు పంపించి వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని డిప్యూటీ కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, వార్డు ఆఫీసర్లు, సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

# బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలి

## -డిఎంహెచ్‌వోకు టిఎన్‌జివోస్ నేతలు వినతి



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : వైద్య ఆరోగ్య శాఖలో చేపట్టనున్న సాధారణ బదిలీలు పారద ర్శకంగా, న్యాయబద్ధంగా నిర్వహించాలని టిఎ న్‌జివోస్ యూనియన్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాసరావు తెలిపారు. సాధారణ బదిలీల సందర్భంగా తలెత్తే పలు సమస్యలు పరి ష్కరించాలని కోరుతూ గురువారం టిఎన్‌జివోస్ యూనియన్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు గుంటు పల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరో గ్యశాఖాధికారి డాక్టర్ రామారావుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గుంటుపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ సాధారణ బదిలీల ప్రక్రియలో ఉద్యోగులకు ఎదురవుతున్న సమస్య లను పరిష్కరించి పారదర్శకంగా, న్యాయబద్ధంగా బదిలీలు నిర్వహించాలని కోరారు. స్పందిం చిన డిఎంహెచ్‌వో మాట్లాడుతూ సంబంధిత అంశాలను రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. డిఎంహెచ్‌వో సానుకూల స్పందన పట్ల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిఎన్‌జివోస్ రాష్ట్ర ఆర్గనై జింగ్ సెక్రటరీ జెడ్ఎస్ జైపాల్, జిల్లా జాయింట్ సెక్రటరీ తాళ్లూరి శ్రీకాంత్, మెడికల్ హెల్త్ ఫోరం జిల్లా అధ్యక్షులు సి. సైదులు, అసోసియేట్ అధ్యక్షులు జి. వీరన్న, ఆర్గనైజింగ్ సెక్రటరీ కృష్ణ, డిఎంహెచ్‌వో కార్యాలయ సిబ్బంది, నర్సింగ్ అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

# బిఎస్ఎన్ఎల్ సేవలు మెరుగుపర్చాలి

## -ఎంపి రఘురాంరెడ్డి



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలో బిఎస్ఎన్ఎల్ సేవలను మెరుగుపరిచి, ఏజెన్సీ ప్రాంతాల్లో సిగ్నల్ సమస్య లేకుండా నిరంతరాయంగా సేవలు అందేలా చూడాలని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి అధికారు లను ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లోని తన నివాసంలో టెలికం విభాగం (డివోటి), ఏపిఎల్ఎస్ఏ హైదరాబాద్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డి. భాస్కర్‌రావు, అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ జి. గణేష్ కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ కె. లక్ష్మణ్‌కుమార్, బిఎస్ఎన్ఎల్ హైదరాబాద్ డిప్యూటీ జనరల్ మేనేజర్ సి. రమణ లతో ఎంపి రఘురాంరెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ ఇటీవల కేంద్ర టెలికం కార్యదర్శిని కలిసి ఉభయ జిల్లాల్లో, ముఖ్యంగా మారుమూల ప్రాంతాల్లో కనెక్టివిటి సమస్యను అధిగమించడానికి 25 నూతన టవ ర్లను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించినట్లు ఆయన గుర్తు చేశారు. ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను కోరారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజన గ్రామాలు, సరిహద్దు గ్రామాల్లో ఫోన్, ఇంటర్నెట్ సేవలు నిరంతరాయంగా అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నెట్‌వర్క్ సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో ఉన్న లోపాలను గుర్తించి సత్వర చర్యలు తీసుకోవాలని ఎంపి ఆదేశించారు. ఈ సమావే శంలో అధికారులు టవర్ల ఏర్పాటుకు సంబంధించిన ప్రస్తుత స్థితిగ తులు, సాంకేతిక అంశాలను ఎంపికి వివరించారు.

# కాంగ్రెస్ కార్యాలయంలో ప్రజా దర్బార్



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్య నారాయణ తెలిపారు. గురువారం ఖమ్మం కాంగ్రెస్ కార్యాలయం సంజీ వరెడ్డి భవన్‌లో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ పాల్గొని దరఖాస్తులను స్వీకరిం చారు. ఈసందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజా దర్బార్‌లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సౌజన్యంతో అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ కార్యకర్తలే కాకుండా ప్రజలు కూడా ప్రజా దర్బార్‌లో సమస్యలపై దరఖాస్తులు ఇవ్వవచ్చునని తెలిపారు. ప్రజా దర్బార్‌పై మండ లాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. ప్రజావాణిలో 15 దరఖాస్తులు అందాయన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, సేవాదళ్ అధ్యక్షులు సయ్యద్ గౌస్, కాంగ్రెస్ ఉపాధ్యక్షులు తుములూరి లక్ష్మీ నర్సింహారావు, కంచర్ల వెంకటన ర్సయ్య, పులిబండ్ల చిట్టిబాబు, కొప్పుల గోవిందరావు, కర్నాటి రామారావు, బండి మాధవరావు, మద్దినేని రమేష్, పార్థసారథి, కొట్టే రాజశేఖర్, పాటి నర్సయ్య, గజ్జి సూర్యనారాయణ, ఫరీద్ ఖాద్రి, నరేందర్, స్వరూప, శ్రీలత, సుగుణ, నీలవేణి తదితరులు పాల్గొన్నారు.

**ఉచిత హెల్త్ క్యాంపు :**

ప్రజా దర్బార్ కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ డాక్టర్ సెల్ అధ్యక్షులు డా॥ కాపా మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఉచిత హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఉచితంగా షుగర్, బిపి టెస్టులు నిర్వహించారు. అవసరం ఉన్న వారికి మందులు పంపిణీ చేశారు.

# ఎస్ఎస్‌సి సప్లిమెంటరీ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు

## -జూన్ ఐదు నుంచి 11 వరకు పరీక్షలు

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఎస్ఎస్‌సి అడ్వాన్స్డ్ సప్లమెంటరీ పరీ క్షలు జూన్ ఐదు నుంచి 11 వరకు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశా ఖాధికారి చైతన్య జైని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణ కోసం జిల్లాలో మూడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నెస్పి కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, రిక్కాబజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, శాంతినగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఖమ్మంలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 1037 మంది విద్యా ర్థులు పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. పర్యవేక్షణ కోసం ఒక పరీక్షా జోన్ ఏర్పాటు చేయడంతో పాటు ఒక ఫ్లయింగ్ స్క్వాడ్, మూడు సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమించినట్లు తెలిపారు. విద్యార్థులు పరీక్షా ప్రారంభానికి ముందుగానే కేంద్రానికి చేరుకోవాలని ఉదయం 9.35 గంటల తర్వాత ఎట్టి పరిస్థితుల్లో పరీక్షా కేంద్రంలోకి అనుమతించబడ రని స్పష్టం చేశారు. హాల్‌టికెట్లు తప్పనిసరిగా వెంట తీసుకు రావాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో సెల్ ఫోన్, స్మార్ట్ వాచీలు, బ్లూటూత్ పరికరాలు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు, పుస్తకాలు, నోట్స్ ఇతర అనాధికార వస్తువులను అనుమతించబోమని తెలిపారు. ఓఎంఆర్ జవాబు పత్రంపై అభ్యర్థులు తమ వివరాలను జాగ్రత్తగా నమోదు చేయాలని ఫోటో కలి గిన హాల్ టికెట్‌ను వెంట తీసుకు రావాలని సూచించారు. పరీక్షలను పారదర్శకంగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి తెలిపారు.

## బాసరలో సీట్లు సాధించిన ప్రభుత్వ విద్యార్థులు



ప్రజాపక్షం/మణుగూరు: మణుగూరు ప్రభుత్వ జెడ్ పి హెచ్ ఎస్ కో ఎడ్యుకేషన్ పాఠశాల నుండి 2026 పదవ తరగతి పరీక్ష ఫలితాలలో ఉత్తీర్ణులైన విద్యార్థులు బాసర ఐఐటి కి ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ జి నాగశ్రీ తెలిపారు. 20252026 విద్యా సంవత్సరానికి సంబంధించిన విద్యార్థులు పదవ తరగతి పరీక్షలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని తెలిపారు. గంజి జీష్మర మణిక 565 జె వికాస్ 563 అత్యధిక మార్కులు సాధించారని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతం నుండి పదవ తరగతి లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు బాసర ఐఐటీకి ఎంపిక కావడం గర్వకారణంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను మరియు ఇంతటి విజయాన్ని కారకులైన ఉపాధ్యాయులను తల్లిదండ్రులను అభినందించారు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధిస్తామని తెలిపారు.

## మాణిక్యారంలో మనిషా లక్ష్మీ విస్తృత పర్యటన



ప్రజాపక్షం/కారేపల్లి: సింగరేణి మండలంలోని మాణిక్యారం గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకురాలు మనిషా లక్ష్మీ విస్తృతంగా పర్యటించారు. ఈసందర్భంగా మాజీ సర్పంచ్ భూక్యా రంగారావు కుమారుడి వివాహ వేడుకలో ముఖ్యఅతిథిగా పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం అక్కడికి వచ్చిన పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలతో మమేకమై వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. తన తండ్రి మదన్ లాల్ ఆశయ సాధన కోసమే తాను ప్రజాక్షేత్రంలోకి వచ్చానని, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మనిషా లక్ష్మీ తెలిపారు. ఈకార్యక్రమంలో సింగరేణి మండల మాజీ జెడ్పిటిసి ఉన్నం వీరేందర్, వాంకుడోత్ జగన్ నాయక్, డొంకెన రవీందర్, లకావత్ రాము, తెలగర్ల రామారావు, ధారావత్ వికాస్, మాజీ సర్పంచ్ కుర్సం సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ శివరాత్రి అచ్చయ్య, పార్వతి, జడల కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ దీపికల సమ్మె విరమణ!



ప్రజాపక్షం/నేలకొండపల్లి : తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గత 15 రోజులుగా గ్రామ దీపికలు (వీఓఏలు) చేపట్టిన సమ్మె గురువారం నాటితో విరమణ పొందింది. నెలకు రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలని, తమను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని తదితర డిమాండ్లతో నేలకొండపల్లి మండల కేంద్రంలో వీరు సుదీర్ఘంగా సమ్మె నిర్వహించారు. ఈ నేపథ్యంలో యూనియన్ రాష్ట్ర నాయకులతో ప్రభుత్వం జరిపిన చర్చలు సఫలం కావడం, సమస్యల పరిష్కారానికి సానుకూల హామీ లభించడంతో సమ్మెను విరమిస్తున్నట్లు స్థానిక నాయకులు ప్రకటించారు. గురువారం మండల కేంద్రం లోని దీక్షా శిబిరం వద్దకు ఐకేపీ ఏపీఎం కే.సురేంద్రబాబు, స్థానిక సర్పంచ్ శీలం వెంకటలక్ష్మి చేరుకుని గ్రామ దీపికల సమ్మెకు సంఘీభావం తెలిపారు. అనంతరం దీక్షలో ఉన్న వారికి నిమ్మరసం ఇచ్చి సమ్మెను అధికారికంగా విరమింపజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకురాలు రాజపుత్ర పార్వతీబాయి మాట్లాడుతూ, తమ సమస్యల సాధన కోసం చేసిన ఈ పోరాటానికి, సమ్మెకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించి సంఘీభావం తెలిపిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అయితే, ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీలను నిర్ణీత గడువులోగా నెరవేర్చకుంటే, విధులను బహిష్కరించి తిరిగి ఉధృత స్థాయిలో ఆందోళనలు చేపడతామని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ సిబ్బంది, గ్రామ దీపికల యూనియన్ ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో వీఓఏలు పాల్గొన్నారు.

## ప్రీ ప్రైమరీ అడ్మిషన్స్ ప్రారంభించిన అదనపు కలెక్టర్



ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి : తెలంగాణ ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ప్రీ, ప్రైమరీ తరగతుల అడ్మిషన్ ప్రక్రియను అన్నపురెడ్డిపల్లి మండలంలోని ఎర్రగుంట ప్రాథమిక పాఠశాలలో అదనపు కలెక్టర్ విద్యా చందన ప్రారంభించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా బూరుగూడెం గ్రామానికి చెందిన షేక్ అబ్దుల్లా కుమారుడు జుబేర్‌కు ప్రీ, ప్రైమరీలో ప్రవేశం కల్పించారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని, ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకునేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. అన్నదేవం, రాజపురం, ఎర్రగుంట ప్రాథమిక పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రీ, ప్రైమరీ తరగతులు నిర్వహించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని తెలిపారు. త్వరలోనే ఆయా పాఠశాలల్లో విద్యా వాలంటీర్లు, ఆయాలను నియమించనున్నట్లు వెల్లడించారు. ఈకార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఉండేటి ఆనంద్‌కుమార్, పెద్దిరెడ్డిగూడెం సర్పంచ్ సున్నం నాగభూషణం, ఎర్రగుంట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వసుంధర, రాజపురం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దారావత్ రమేష్, ఎర్రగుంట ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు శాంతకుమారి, సుశీల, అంగన్‌వాడీ టీచర్ శ్రీదేవి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఆక్రమణకు గురవుతున్న స్థలాల పరిశీలన

**-ప్రజాపక్షం కథనంతో కదిలిన అధికారులు**
**- పొజిషన్ సర్టిఫికెట్ల సాక్షిగా స్థలాలుగా మారుతున్న రోడ్లు**
**- ఆక్రమణల వెనుక మూడోవార్డు షాడో హస్తం**






ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 23వ వార్డులో ఉన్న ఇందిరమ్మ కాలనీలో ప్రభుత్వ స్థలాలు, ప్రజా వినియోగానికి కేటాయించిన రోడ్లు ఆక్రమణలకు గురవుతున్నాయంటూ ప్రజాపక్షం దినపత్రికలో ప్రచురితమైన దర్జాగా ప్రభుత్వ స్థలాల కబ్జా కథనం అధికార యంత్రాంగాన్ని కదిలించింది. కథనం వెలువడిన వెంటనే రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగి సంబంధిత ప్రాంతాలను పరిశీలించారు. ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ స్థలాలను, కాలనీలోని రోడ్లను పరిశీలించి అధికారులు లబ్ధిదారుల వద్ద ఉన్న పొజిషన్ సర్టిఫికెట్లను తనిఖీ చేశారు. అర్హత లేకుండా పొందిన పొజిషన్ సర్టిఫికెట్లు ఉన్నట్లు తేలితే వాటిని రద్దు చేయడంతో పాటు బాధ్యులపై చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. అయితే ప్రస్తుతం కాలనీలో చర్చనీయాంశంగా మారిన అంశం ఏమిటంటే, ప్రజలకు నివాస స్థలాల కేటాయింపునకు మాత్రమే ఉపయోగపడాల్సిన పొజిషన్ సర్టిఫికెట్లు కొందరి చేతుల్లో రోడ్లను సైతం స్థలాలుగా మార్చే సాధనంగా మారాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాలనీలో వాస్తవంగా ఉండాల్సిన అంతర్గత రహదారులు అక్రమంగా అదృశ్యమవుతూ, వాటి స్థానంలో వ్యక్తిగత ఆక్రమణలు పెరుగుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. స్థానికులు ఆరోపణల ప్రకారం ఈ వ్యవహారం ఒక్కరోజులో జరిగినది కాదని, కొంతకాలంగా ప్రణాళికబద్ధంగా సాగుతోందని చెబుతున్నారు. ప్రభుత్వ భూములు, ప్రజా రహదారులపై కన్నేసిన కొందరు వ్యక్తులు అధికార అండదండలతో ముందుకు సాగుతున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా మూడో వార్డుకు చెందిన ప్రస్తుతం అధికార పార్టీ నాయకుడు అని చెప్పుకుంటున్న మూడవ వార్డుకు చెందిన ఓ షాడో అనుచరుల ప్రమేయంపై స్థానికులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఇందిరమ్మ కాలనీలోని స్థలాల వ్యవహారాలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. ప్రభుత్వ భూములు, ప్రజా రహదారులు కాపాడబతాయా?లేక ఆక్రమణదారుల చేతుల్లోనే మాయవుతాయా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

### మూడోవార్డు షాడో అనుయాయులు...

ప్రభుత్వ స్థలాల ఆక్రమణ వ్యవహారంలో తీగలాగితే డొంక కదిలిన చందంగా కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ప్రస్తుత అధికార పార్టీకి చెందిన వ్యక్తిగా చెప్పుకునే మూడోవార్డుకు చెందిన ఓ షాడో అనుయాయులే ఆక్రమణల వెనుక ఉన్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. స్థానికుల కథనం ప్రకారం, సదరు షాడోకి సన్నిహితంగా ఉండే కొందరు వ్యక్తులు ప్రభుత్వ స్థలాల ఆక్రమణలో కీలక పాత్ర పోషిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇందిరమ్మ కాలనీలో ప్రజా అవసరాల కోసం ఉద్దేశించిన రహదారులను సైతం పొజిషన్ సర్టిఫికెట్ల ఆధారంగా స్థలాలుగా మార్చే ప్రయత్నాలు జరిగాయని స్థానికులు చెబుతున్నారు.

ఆక్రమణలకు పాల్పడుతున్న వారిలో కొందరు అసలు అర్హత ప్రమాణాలు లేని వారేనని, అయినప్పటికీ షాడో అండదండలతో ఈ వ్యవహారం కొనసాగుతోందని ఆరోపిస్తున్నారు. ఆశ్చర్యకరంగా అధికార పార్టీకి చెందిన కొందరు నేతలే అనధికారికంగా ఈ అంశంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, షాడో తీరుతో పార్టీ ప్రతిష్టను దెబ్బతీస్తున్నాడని వ్యాఖ్యానిస్తుండటం విశేషం. ఈ నేపథ్యంలో ప్రభుత్వ స్థలాలు, రహదారులు, ప్రజా వినియోగానికి కేటాయించిన భూములు ఆక్రమణలకు గురవుతున్నాయనే ఆరోపణల నేపథ్యంలో పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఆక్రమణల వెనుక ఉన్న అసలు వ్యక్తులు ఎవరనే అంశంపై విచారణ చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు.

### పొజిషన్ సర్టిఫికెట్‌పై నీలి నీడలు...

పొజిషన్ సర్టిఫికెట్ అనేది ఒక వ్యక్తి నిర్దిష్ట స్థలం లేదా? ఇంటి స్థలాన్ని వాస్తవంగా నిర్మాణం చేసుకుని స్వాధీనంలో కలిగి ఉన్నాడని ధృవీకరించే పత్రం. ప్రభుత్వ గృహ స్థలాల పథకాల లబ్ధిదారులకు ఇందిరమ్మ, డబుల్‌బెడ్‌రూమ్ లేదా? ఇతర హౌసింగ్ పథకాల కింద స్థలం కేటాయించిన వారికి రెవెన్యూ లేదా? సంబంధిత ప్రభుత్వ శాఖలు స్థలం కేటాయించిన తర్వాత జారీ చేస్తారు. అంతేకానీ పొజిషన్ సర్టిఫికెట్ అంటే యాజమాన్య హక్కు పత్రం కాదు. ఇది కేవలం ఆ స్థలం లబ్ధిదారుడి స్వాధీనంలో ఉందని సూచిస్తుంది. ఆ స్థలం సరిహద్దులు, విస్తీర్ణం, కేటాయింపు వివరాలను మాత్రమే తెలియపరుస్తుంది. కానీ ఇప్పుడు పొజిషన్ సర్టిఫికెట్లు పొంది ఖాళీ ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తున్న తీరు విస్తుగొలుపుతోంది. ప్రస్తుతం పొజిషన్ సర్టిఫికెట్లు పొందిన వారిలో అర్హులు ఉన్నప్పటికీ అనర్హులను ఏరివేయాలనే డిమాండ్ వ్యక్తమవుతుంది. అక్కడి ప్రస్తుత అధికార పార్టీలో సైతం రెండు గ్రూపులుగా ఏర్పడి పొజిషన్ సర్టిఫికెట్ పొందిన వారిపై రాని అర్హత కలిగినవారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ పూర్తిస్థాయి వ్యవహారంలో అధికారుల పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఖాళీ స్థలాలకు పొజిషన్ సర్టిఫికెట్లను ఇవ్వడంపై లీగల్‌గా ఫైట్ చేసేందుకు మరికొందరు సిద్ధమైనట్లు తెలిసింది.

### పొజిషన్ సర్టిఫికెట్లను పరిశీలిస్తాను తహశీల్దార్, వినయేందర్‌రెడ్డి

ప్రభుత్వం కేటాయించిన ఇంటి స్థలాల్లో ఇల్లు నిర్మించుకుని వాస్తవంగా నివాసం ఉంటున్న వారికి మాత్రమే పొజిషన్ సర్టిఫికెట్లు జారీ చేయడం జరుగుతుంది. అంతేకానీ ఖాళీ స్థలాలకు పొజిషన్ సర్టిఫికెట్లు జారీ చేసే అవకాశం లేదు. ఇటీవల జారీ చేసిన పొజిషన్ సర్టిఫికెట్లన్నింటినీ పరిశీలిస్తాను. అర్హత లేకుండా పొందినట్లు తేలితే సంబంధిత సర్టిఫికెట్లపై నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటాను.

# పోలవరం ముంపుపై తక్షణ చర్యలు తీసుకోవాలి

**-పీపీఏ, సీడబ్ల్యూసీ అధికారులకు ఎంఎల్ఏ పాయం వినతి**



ప్రజాపక్షం/బూర్గంపాడు: పోలవరం ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ ప్రభావంతో పినపాక నియోజకవర్గంలోని గ్రామాలు, వ్యవసాయ భూములు, ప్రజల జీవనోపాధి తీవ్ర ముప్పును ఎదుర్కొంటున్నాయని పేర్కొంటూ పినపాక ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ(పీపీఏ), సెంట్రల్ వాటర్ కమిషన్(సీడబ్ల్యూసీ)అధికారులకు సమగ్ర వినతిపత్రం సమర్పించారు. బూర్గంపాడు, అశ్వాపురం మండలాలతో పాటు నాగినేనిప్రోలు రెడ్డిపాలెం తదితర గ్రామాలు ముంపు ముప్పులో ఉన్నాయని, అధికారిక అంచనాల కంటే ఎక్కువ విస్తీర్ణంలో భూములు ప్రభావితమయ్యే ప్రమాదం ఉందని ఎంఎల్ఏ తెలిపారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన వందలాది కుటుంబాలు నిర్వాసితులయ్యే పరిస్థితి నెలకొంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. గోదావరి వరదలతో ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రాంతాల్లో పోలవరం బ్యాక్ వాటర్ ప్రభావం మరింత సమస్యాత్మకంగా మారుతోందని, వాగులు, ఉప వాగులు, సహజ నీటి పారుదల మార్గాలపై ప్రభావం వల్ల వ్యవసాయం, గ్రామీణ జీవనం దెబ్బతింటోందన్నారు. అశ్వాపురంలోని జాతీయ ప్రాధాన్యత కలిగిన హెవీ వాటర్ ప్లాంట్ భద్రతపైనా ముప్పు పొంచి ఉందని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రభావిత ప్రాంతాల్లో శాస్త్రీయ సర్వే, ప్రత్యేక పునరావాస ప్యాకేజీ, రైతులకు న్యాయమైన పరిహారం, ఉపనదులపై అధ్యయనం, శాశ్వత వరద నియంత్రణ చర్యలు, రక్షణ కరకట్టలు, ఫ్లడ్ ప్రొటెక్షన్ వాల్స్ నిర్మాణం తదితర పది ప్రధాన డిమాండ్లను వినతి పత్రంలో పొందుపరిచారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, నిపుణులతో సంయుక్త కమిటీ ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేపట్టాలని, ప్రజల అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకోకుండా ఎలాంటి నిర్ణయాలు అమలు చేయరాదని ఎంఎల్ఏ స్పష్టం చేశారు. పోలవరం బ్యాక్ వాటర్ ప్రభావిత ప్రాంతాల ప్రజలకు సంపూర్ణ న్యాయం జరిగేలా కేంద్ర ప్రభుత్వం, పీపీఏ, సంబంధిత అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

**- కలెక్టర్ అంకిత్**






ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం, లక్ష్యమని కలెక్టర్ అంకిత్ అన్నారు. జిల్లా పరిధిలోని చంద్రుగొండ మండలం తిప్పనపల్లిలో గురువారం గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం విజయవంతంగా నడుస్తుందన్నారు. గ్రామసభలు ప్రజల సమస్యలను ప్రభుత్వానికి చేరవేసే వేదికలన్నారు. విద్యా,వైద్య, గ్రామీణాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, పారిశుధ్యం, వర్షా కాలంలో అంటు వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ప్రజాపాలనప్రగతి ప్రణాళిక ద్వారా ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువవుతున్నాయని అన్నారు. గ్రామాల్లో తడి, పొడి చెత్తను వేరు చేసి విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడం ద్వారా అంటువ్యాధులు సోక కుండా ఉంటాయన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా అవకాశం కల్పించాలన్నారు. అనర్హులను ఓటరు జాబితా నుండి తొలగించాలన్నారు. బడిబాట కార్యక్రమాన్ని విజయవంతంగా చేయాలని, ప్రభుత్వబడుల్లో విద్యార్థుల హాజరు శాతం పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా గ్రామసర్పంచ్, రైతులు, గ్రామస్తులు పంట పొలాలకు వెళ్లే రహదారుల అభివృద్ధి, అదనపు విద్యుత్ లైన్లు, అంతర్గత రహదారుల నిర్మాణం, ఆర్వోవాటర్ ప్లాంట్ల ఏర్పాటు వంటి సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే చర్యలు చేపట్టాలని సంబంధిక శాఖల అదికారులను కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామారావు, డిఆర్‌డిఓ విద్యాచందన, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కూసుమంచి డీసీసీబీపై సీఈఓ ఆకస్మిక తనిఖీ

**-డిపాజిట్ల పెంపు, గోల్డ్ లోన్ల ప్రచారంపై ప్రత్యేక దృష్టి**



ప్రజాపక్షం/కూసుమంచి: కూసుమంచి మండల కేంద్రంలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీబీ)శాఖను బ్యాంకు సీఈఓ ఎన్వి ఆదిత్య గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా బ్యాంకు వ్యాపారాభివృద్ధి, డిపాజిట్ల సేకరణ, రుణాల మంజూరు, ఖాతాదారులకు అందుతున్న సేవలను సమీక్షించారు. ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో సీఈఓ మాట్లాడుతూ బ్యాంకు అభివృద్ధికి డిపాజిట్లే ప్రధాన బలమని, ప్రతి ఉద్యోగి డిపాజిట్ల పెంపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. గోల్డ్ లోన్లు ప్రజలకు ఎంతో ఉపయోగకరమని, వాటిపై విస్తృత ప్రచారం నిర్వహించి ఖాతాదారులకు చైతన్య పరచాలని ఆదేశించారు. డిజిటల్ బ్యాంకింగ్ సేవల వినియోగాన్ని పెంచి మెరుగైన సేవలు అందించాలని సూచించారు. అనంతరం కల్లూరుగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్)ను సందర్శించిన సీఈవో ఆదిత్య, సొసైటీ సూపర్వైజర్ కొంగర వేణు, ఇన్చార్జి శేఖర్‌తో సమావేశమై పనితీరును సమీక్షించారు. రైతులకు అందిస్తున్న పంట రుణాలు, ఎరువులు, విత్తనాల సరఫరా, రుణాల వసూళ్లు, సభ్యుల నమోదు, డిపాజిట్ల సేకరణపై వివరాలు తెలుసుకున్నారు. సహకార సంఘాలు గ్రామీణ రైతాంగానికి వెన్నెముకలాంటివని పేర్కొన్న ఆయన, రైతులకు అవసరమైన సేవలు సకాలంలో అందేలా చూడాలని, రుణాల పంపిణీలో పారదర్శకత పాటించి రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. సొసైటీ అభివృద్ధి, సభ్యుల సంఖ్య పెంపు, ఆర్థిక లావాదేవీల విస్తరణపై ప్రత్యేక దృష్టి సారించాలని వివరించారు. ఈ తనిఖీలో బ్యాంకు అధికారులు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

# సుతారీల మధ్య పని పంచాయతీ..!

**-పోలీస్ స్టేషన్ ఎదుట సుతారీ మేస్త్రీల నిరసన**
**-పోలీసుల తీరుపై ఆగ్రహం.. పరస్పర ఫిర్యాదులు**





ప్రజాపక్షం/నేలకొండపల్లి : భవన నిర్మాణ కార్మికుల సుతారీ మేస్త్రీ మధ్య పని విషయంలో మొదలైన వివాదం చిలికి చిలికి గాలివానగా మారి పోలీస్ స్టేషన్ పంచాయతీకి దారితీసింది. ఈ క్రమంలో పోలీసులు స్థానిక మేస్త్రీల పట్ల అనుచితంగా వ్యవహరించారంటూ సుతారీ కార్మికులు పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళ్తే, నేలకొండపల్లి మండలంలోని చెన్నారం గ్రామానికి చెందిన మురళి అనే వ్యక్తి ఇంటి నిర్మాణ పనుల కోసం ఈ నెల 1వ తేదీన సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణానికి చెందిన సుతారీ మే)లను పిలిపించి పని ప్రారంభించారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక సుతారీ మేస్త్రీలు అక్కడికి చేరుకుని, నిబంధనలకు విరుద్ధంగా బయటి ప్రాంతం వారు ఇక్కడ పనులు చేయవద్దని కోదాడ మేస్త్రీలను ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో ఇరువర్గాల మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వాదం, తోపులాట జరిగాయి. ఈ క్రమంలో కోదాడ మేస్త్రీలకు చెందిన నిర్మాణ సామగ్రిని స్థానిక మేస్త్రీలు తీసుకెళ్లారు. సామగ్రి తీసుకెళ్లడంపై ఇంటి యజమాని మురళి స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీంతో సుతారీ యూనియన్ నాయకులు, కార్మికులు భారీగా పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. అయితే, పోలీసులు కోదాడ మేస్త్రీలకు, ఇంటి యజమానికి అనుకూలంగా వ్యవహరిస్తూ, స్థానిక సుతారీ మే)ల పట్ల దురుసుగా ప్రవర్తించారని కార్మిక నాయకులు ఆరోపించారు. పోలీసుల తీరుకు నిరసనగా స్టేషన్ ఎదుట బైఠాయించి, వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ధర్నాకు దిగారు. తమకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆపేది లేదని హెచ్చరించారు. ఈ వివాదం ఇలా ఉండగా, స్థానిక సుతారీ మేస్త్రీ విజయ్ తనను కులం పేరుతో దూషించాడంటూ ఇంటి యజమాని మురళిపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. దీంతో ఇరువర్గాలు ఒకరిపై ఒకరు పరస్పరం ఫిర్యాదులు చేసుకోవడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆకస్మికంగా విత్తన దుకాణాల తనిఖీ



ప్రజాపక్షం/ములకలపల్లి: ములకలపల్లి మండలంలోని పలు విత్తన దుకాణాలను జిల్లా వ్యవసాయ అధికారి వి బాబురావు, మండల వ్యవసాయ అధికారి బి అరుణ్ బాబుతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా వరి, పత్తి విత్తనాల స్టాక్ రిజిస్టర్లు, ఇన్వాయిస్లు, సోర్స్ సర్టిఫికెట్లు పరిశీలించారు. అన్ని విత్తన దుకాణాలు స్టాక్ రిజిస్టర్లు, స్టాక్ బోర్డులు, సోర్స్ సర్టిఫికెట్లు తప్పని సరిగా నిర్వహించాలని, రైతులకు విక్రయించే ప్రతి విత్తనానికి బిల్లు ఇవ్వాలని డీలర్లకు సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే విత్తన చట్టం 1966 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు ప్రభుత్వం గుర్తింపు పొందిన లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేసి, తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో లేబుల్ లేని లేదా అనుమతి లేని విత్తనాల విక్రయాలు జరిగితే వెంటనే వ్యవసాయ, పోలీసు అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ఈ తనిఖీల్లో మండల వ్యవసాయ అధికారి అరుణ్ బాబు, రైతులు, విత్తన డీలర్లు, పాల్గొన్నారు.

## ఇరవెండిలో ప్రత్యేక గ్రామసభ



ప్రజాపక్షం/బూర్గంపాడు : గ్రామ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జెడ్పి సీఈవో నాగలక్ష్మీ అన్నారు. గురువారం ఇరవెండి గ్రామ పంచాయితీ కార్యాలయంలో సర్పంచ్ గుండి బాబు అధ్యక్షతన ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామ సభకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా గ్రామంలో నెలకొన్న వివిధ సమస్యలను ప్రజల నుంచి తెలుసుకున్న ఆమె, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందేలా అధికారులు కృషి చేయాలని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో జమలారెడ్డి, మాజీ ఎంపీటీసీ వల్లూరిపల్లి వంశీకృష్ణ, ఉప సర్పంచ్ మహంకాళి, వివిధ శాఖల అధికారులు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## బడిబాటకు విశేష స్పందన



ప్రజాపక్షం/పినపాక: మండల పరిధిలో ఏడూళ్ల బయ్యారం గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు గ్రామంలో గడప గడపకు తిరుగుతూ విద్యార్థుల తల్లిదండ్రులను కలుసుకుని ప్రభుత్వ పాఠశాలల ప్రధాన్యతను వివరించారు. కార్యక్రమానికి విశేష స్పందన లభించగా, పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఏడూళ్లబయ్యారంలో చేర్పించేందుకు ముందుకు వచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య, సౌకర్యాల పట్ల ప్రత్యేక ఆదరణ చూపుతూ తమ పిల్లల భవిష్యత్తు కోసం ప్రభుత్వ పాఠశాలనే ఎంపిక చేసుకున్నారు. విద్యార్థుల చేరికలు పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామని ఉపాధ్యాయులు తెలిపారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొమరం నాగయ్య, పాఠశాల పీడీ వీరన్న, ఉపాధ్యాయులు షబ్బీర్ పాషా, తదితర ఉపాధ్యాయులు పాల్గొని బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## శేష జీవితం సంతోషంగా కడపాలి



ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం: సుదీర్ఘ కాలంగా పాటు పోలీస్ శాఖలో హోమ్ గార్డు వృత్తి కొనసాగిస్తూ పదవీ విరమణ పొందిన మీరు శేష జీవితాన్ని సంతోషంగా గడపాలని ఎస్పి రోహిత్ రాజ్ ఆకాంక్షించారు. గురువారం ఎస్పి తన కార్యాలయంలో పదవీ విరమణ పొందిన రాంబాయి, నర్సింహారావులను పూల మాలలతో సత్కరించి షాలువా కప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదవీ విరమణ ప్రతీ ఒక్కరూ పొందాల్సి ఉంటుందని, అయినప్పటికీ ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలు చేసుకుంటూ పోవాలన్నారు. ఎవైనా సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. దైనందన జీవితంలో యోగా, వ్యాయామాన్ని అలవర్చుకుని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డివిస్పి సత్యనారాయణ, ఎస్‌బి సిఐ శ్రీనివాస్, హోంగార్డు ఆర్గనైజేషన్ రిజర్వ్ ఇన్స్‌పెక్టర్ నరసింహారావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కమలాకర్‌కు రూ.5 లక్షల ఎల్ఓసీ అందజేత



ప్రజాపక్షం/మణుగూరు: పినపాక మండలం కొత్తగూడెం గ్రామానికి చెందిన తోలెం కమలాకర్ అత్యవసర వైద్య చికిత్స కోసం మంజూరైన రూ.5 లక్షల ఎల్ఓసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) పత్రాన్ని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మణుగూరు క్యాంపు కార్యాలయంలో కమలాకర్ తరఫున మంకిడి సురేష్‌కు అందజేశారు. ప్రజల ఆరోగ్య సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. కమలాకర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ సహాయంపై కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

# మహిళల పక్షాన చారిత్రిక పోరాటాలు

-ఏపూరి లతాదేవి

-ఘనంగా ఎన్ఎఫ్ఐడబ్ల్యూ వ్యవస్థాపక దినోత్సవం



**ప్రజాపక్షం/ ఖమ్మం :** మహిళల పక్షాన భారతదేశంలో చారిత్రిక పోరాటాలను నిర్వర్తించిన ఘనత భారత మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ)కు దక్కుతుందని భారత మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి ఏపూరి లతాదేవి తెలిపారు. దశాబ్దాల పోరాట చరిత్రలో అనేక పోరాట విజయాలను మహిళా సమాఖ్య సాధించిందని ఆమె తెలిపారు. మహిళా సమాఖ్య 72వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక సిపిఐ కార్యాలయంలో మహిళా సమాఖ్య పతాకాన్ని ఏపూరి లతాదేవి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు బత్తినేని నీరజ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏపూరి లతాదేవి మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడున్నర దశాబ్దాలు గడిచిన మహిళలు ఇంకా వివక్షను ఎదుర్కొంటునే ఉన్నారన్నారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో ముందు వరుసలో ఉండి పని చేస్తున్నా వివక్ష పోవడం లేదన్నారు. చట్టాలు అక్రమార్కులకు, కామాంధులకు చుట్టాలుగా మారుతున్నాయని లతాదేవి ఆవేదన వ్యక్తం చేశారు. భారత మహిళా సమాఖ్య అనేక చారిత్రిక పోరాటాలను నిర్వహించిందని ప్రస్తుతం మహిళలు అనుభవిస్తున్న చట్టాల వెనుక మహిళా సమాఖ్య పోరాటాలు దాగి ఉన్నాయన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం పోరాడుతున్నామని కానీ డిలిమిటేషన్‌తో ముడిపెట్టి మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకుంటున్నారని లతాదేవి ఆరోపించారు. మహిళల చట్టాలను చిత్తశుద్ధితో అమలు చేయాలని, వివిధ కేసులకు సంబంధించి ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా తక్షణ న్యాయం అందేవిధంగా చర్యలు తీసుకోవాలని లతాదేవి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య రాష్ట్ర నాయకురాలు పోటు కళావతి, జిల్లా బాధ్యులు జమ్ముల లక్ష్మి, మందడపు రాణి, దండి రాజేశ్వరి, ఓరుగంటి ప్రమీల, భవాని, సృజన, కృష్ణవేణి, సౌజన్య, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి

-ఎస్ఐఆర్ శిక్షణలో పాల్గొన్న కలెక్టర్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి అర్హుడైన వ్యక్తికి ఓటు హక్కు కల్పించే లక్ష్యంతో అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. ఎస్ఐఆర్ కార్యక్రమంపై కేంద్ర ఎన్నికల సంఘం ప్రతినిధులు విలాస్ దుబే, అమృత గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ శిక్షణా కార్యక్రమంలో ఖమ్మం కలెక్టరేట్ నుంచి జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్ అదనపు కలెక్టర్ డా॥ పి.శ్రీజతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘం ప్రతినిధులు ఎన్యుమరేషన్ ఫారాల ముద్రణ, పంపిణీ, ఓటర్ల నుంచి సేకరించిన ఎన్యుమరేషన్ ఫారాలను డిజిటలైజేషన్ చేయడం, డేటా నమోదు, ధృవీకరణ ప్రక్రియలు తదితర అంశాలపై అధికారులకు శిక్షణ అందించారు. శిక్షణ అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో మ్యాపింగ్ ప్రక్రియ పూర్తయిన వాటిని సూపర్‌వైజర్లు మ్యాపింగ్‌ను మరోసారి క్షుణ్ణంగా ధృవీకరించాలని సూచించారు. 2002 ఎస్ఐఆర్ ఓటర్లు, వారి కుటుంబ సభ్యుల వివరాలను తప్పనిసరిగా మ్యాప్ చేసి క్రాస్ వెరిఫికేషన్ నిర్వహించాలని తెలిపారు. ప్రతి అర్హుడైన వ్యక్తికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. రాజకీయ పార్టీలకు అనుబంధం లేని వాలంటీర్లను గుర్తించి వారికి తగిన శిక్షణ అందించాలన్నారు. మ్యాపింగ్ పూర్తయిన అనంతరం మిగిలిన ఓటర్లందరి నుంచి ఎన్యుమరేషన్ ఫారాలు స్వీకరించాలని తెలిపారు. మాస్టర్ ట్రైనర్ల ద్వారా బిఎల్‌వోలకు పూర్తి స్థాయి శిక్షణ అందేలా సూపర్‌వైజర్లు పర్యవేక్షించాలని ప్రతి పోలింగ్ కేంద్రంలో అవసరమైన ఫారాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, డిఆర్‌వో, ఆర్డీవో శ్రీనివాస్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు రాజు, డిటి అన్సారీ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## నూతన ఆడిటోరియం ప్రారంభం



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** పట్టణంలోని జేవీఆర్ డిగ్రీ కళాశాలలో రూ. 95 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన ఆడిటోరియంను సత్తుపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు డా.మట్టా రాగమయి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ పాల్గొని కళాశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడంలో భాగంగా ఆధునిక సౌకర్యాలతో ఈ ఆడిటోరియంను నిర్మించినట్లు వారు పేర్కొన్నారు. కళాశాలలో నిర్వహించే విద్యా, సాంస్కృతిక కార్యక్రమాలు, సెమినార్లు, సమావేశాలకు ఈ నూతన ఆడిటోరియం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రిహన బేగం కమల్ పాషా, వైస్ చైర్మన్ బొం తు సుమలత, సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, సత్తుపల్లి మున్సిపల్ కౌన్సిలర్స్, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాదె చెన్నారావు,సత్తుపల్లి మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుబ్బారెడ్డి,సీనియర్ నాయకులు చల్లగుళ్ల నరసింహ రావు, చింతలపాటి సత్యనారాయణ, ఉడతనేని అప్పారావు పాల్గొన్నారు.

# ఏండ్ల నాటి నిరీక్షణకు మోక్షం

- శ్రీరామ్‌నగర్ ప్రజల కల సాకారం దిశగా బ్రిడ్జి నిర్మాణం
- పనులను పరిశీలించిన కౌన్సిలర్ దండి రంగారావు
- మంత్రి పొంగులేటి, కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డికి కృతజ్ఞతలు



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని 28వ వార్డులో ఉన్న శ్రీరామ్ నగర్ వాసుల ఏండ్లనాటి నిరీక్షణకు ఎట్టకేలకు మోక్షం లభించనుంది. ప్రతి వర్షాకాలంలో భారీ వర్షాలు కురిసినప్పుడల్లా సమీప వాగులో నీటి ప్రవాహం పెరగడంతో రహదారి పూర్తిగా మునిగిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. అత్యవసర సమయాల్లో విద్యార్థులు, ఉద్యోగులు, వృద్ధులు, మహిళలు రాకపోకలు సాగించేందుకు నానా అవస్థలు పడాల్సి వచ్చేది. కొన్నిసార్లు రోజుల తరబడి రహదారి తెగిపోవడంతో స్థానికులు తమ ఇళ్లకే పరిమితమయ్యే పరిస్థితులు నెలకొనేవి. స్థానిక ప్రజల సమస్యను గుర్తించిన సిపిఐ నాయకత్వం కాలనీ వాసులతో కలిసి పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. సమస్య పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు, పలువురు మంత్రులకు వినతిపత్రాలు ఇచ్చింది. ఈ నేపథ్యంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పందించి బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో పనులు ప్రారంభమయ్యాయి.

### పనులను పరిశీలన...

ప్రస్తుతం శరవేగంగా సాగుతున్న బ్రిడ్జి స్లాబ్ నిర్మాణ పనులను సిపిఐ కౌన్సిలర్ దండి రంగారావు గురువారం పరిశీలించారు. పనుల నాణ్యత, నిర్మాణ పురోగతి, ఉపయోగిస్తున్న నిర్మాణ సమాగ్రి తదితర అంశాలను పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడారు..ప్రజల ప్రాణాలు, భద్రతకు సంబంధించిన కీలకమైన నిర్మాణం కావడంతో ఎలాంటి రాజీ లేకుండా నాణ్యత ప్రమాణాలను పాటించాలని సూచించారు. పదికాలాలపాటు ఉపయోగపడేలా ఉండాలని, నిర్మాణంలో నిర్లక్ష్యానికి తావు ఇవ్వొద్దని స్పష్టం చేశారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే శ్రీరామ్‌నగర్‌తో పాటు పరిశర ప్రాంతాల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, వ్యాపారులు సులభంగా రాకపోకలు సాగించే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. అలాగే ప్రాంత అభివృద్ధికి ఈ బ్రిడ్జి కీలకంగా మారనుందన్నారు. నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పనుల అమలులో సహకరించిన కమీషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజా పాలన గ్రామ సభలు



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గ్రామ సభలు నిర్వహించారు. గురువారం మండల పరిధిలోని రఘునాథపాలెం, రేగులచలక, కోయచలక, కోటపాడు, బావోజీతండా, మంచుకొండ, వేపకుంట్ల, చెరువుకొమ్ముతండా, జికె బంజర, విఆర్ బంజర గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. సర్పంచ్‌ల అధ్యక్షతన జరిగిన గ్రామసభల్లో వర్షాకాల సన్నద్ధత, సురక్షిత త్రాగునీరు, ఘన వ్యర్థాల నిర్వహణ, జల సంరక్షణ మన సంరక్షణ, ఓటర్ల జాబితా ప్రత్యేక కార్యక్రమం, వరదల నిర్వహణ భద్రత తదితర అంశాలపై గ్రామాల్లో చెత్త నిర్వహణ పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. రఘునాథపాలెం గ్రామంలో సర్పంచ్ గాజుల కృష్ణారావు అధ్యక్షతన నిర్వహించిన సభలో డిఎల్‌పివో విజయలక్ష్మి, ఎంపిడివో అశోక్‌కుమార్, ఎంపివో శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఎల్‌పివో మాట్లాడుతూ గ్రామాల్లో చెత్త నిర్వహణతో పాటు పరిశుభ్రత పాటించేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటి నుంచి సేకరించిన చెత్తకు సంబంధించి నిర్వహణ వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కల పెంపకం చేపట్టాలన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక కార్యక్రమం (ఎస్ఐఆర్)ను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో వరదల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ ఏడాది వర్షాలు తక్కువగా ఉంటాయన్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని తెలిపారు. రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి నానో యూరియా వాడాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రశాంత్‌కుమార్, వార్డు సభ్యులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కడవరకు కమ్యూనిస్టుగా బతికిన సత్యనారాయణ



**ప్రజాపక్షం/చింతకాని :** సీపీఐ సీనియర్ నాయకులు సీతంపేట గ్రామానికి చెందిన కొత్తపల్లి సత్యనారాయణ కడవరకు కమ్యునిస్టుగా బ్రతికాడని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి అన్నారు.గురువారం సీతంపేట గ్రామంలో సత్యనారాయణ మృతదేహంపై జమ్ముల జితేందర్‌రెడ్డి పార్టీ జెండా ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జమ్ముల మాట్లాడుతూ సత్యనారాయణ బ్రతికినంతకాలం ఎర్రజెండా ని ఎత్తుకొని పార్టీ అభివృద్ధి కోసం ఎంతగానో కృషిచేశాడన్నారు.నివాళులర్పించిన వారిలో మాజీ సర్పంచ్ ఆళ్ల రవీందర్, నాయకులు మునిగే కోటేశ్వరావు, మండల కార్యవర్గ సభ్యులు తాళ్లూరి యాదగిరి, నాయకులు తుపాకుల లక్ష్మీనారాయణ గ్రామ సర్పంచ్ ఆళ్ల మణి పానకాలరావు, కాటిన్ని పులలయ్య, బసవయ్య పాల్గొన్నారు.

## సిసిఎస్ పోలీసులకు అభినందనలు..



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** చోరీ కేసు రికవరిలో ఖమ్మం సెంట్రల్ క్రైం పోలీసులు సిబ్బంది చూపిన చోరవకు ఖమ్మం, వరంగల్ పోలీసు కమిషనర్‌లు సునిల్‌దత్, సన్‌ప్రీత్‌సింగ్‌లు అభినందించారు. ఈ మేరకు ప్రశంసాపత్రాలను ఖమ్మం సిపి సునిల్‌దత్ గురువారం తన కార్యాలయంలో సిసిఎస్ సిబ్బందికి అందించారు. ఈ సందర్భంగా ఆయన కేసుకు సంభందించిన వివరాలు తెలియజేశారు. వరంగల్ కాకతీయ విశ్వవిద్యాలయం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల చోరీ జరిగింది. బంగారు అభనరణలను దొంగిలించుకుని పరారైతున్న ముఠాను అక్కడి పోలీసులు సిసి కెమోరాల ఆధారంగా పశ్చిమ బెంగాల్‌కు చెందిన వ్యక్తులు గుర్తించారు. చోరీ జరిగిన అనంతరం నిందితులు ఖమ్మం వైపువెళ్తున్న రైలు ఎక్కి పరారైనట్లు గుర్తించిన వరంగల్ పోలీసులు ఖమ్మం పోలీసులకు సమాచారం అందించారు. సిపి సునిల్‌దత్ ఆదేశాల మేరకు సిసిఎస్ ఏసిపి సర్వర్ నేతృత్వంలో సిబ్బంది ప్రయాణికుల మాదిరిగా స్టేషన్‌లో అగిన ప్రతి రైలు ఎక్కి ప్రతి భోగిని పరిశీలించారు. అనుమానంగా కనిపించిన షేక్ ఫిరోజ్, షేక్ ఎమిన్, షేక్ సుఖ్‌చంద్‌లను తనిఖీ చేయగా వారివద్ద దొంగిలించిన ఆభరణాలు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వీరు పశ్చిమ బెంగాల్‌కు చెందిన వారిగా గుర్తించారు. నిందితుల నుంచి మూడు కేసులకు సంబందించిన 15 తులాల బంగారు అభరణాలు స్వాధీనం చేసుకుని వరంగల్ జిల్లా పోలీసులకు అప్పగించారు. ఈ నేపథ్యంలో చాకచక్యంగా వ్యవహరించి అంతర్‌రాష్ట్ర దొంగలను తక్కువ సమయంలో పట్టుకున్న ఖమ్మం సిసిఎస్ ఏసిపి సర్వర్ తో పాటు సిబ్బందిని ఖమ్మం సిపితో పాటు వరంగల్ సిపి అభినందించారు. ప్రశంస పత్రాల అందిన వారిలో సిపి సునిల్‌దత్ వెంట డిసిపి అడ్మిన్ భోజా రామానుజం, సిసిఎస్ ఏసిపి సర్వర్ ఉన్నారు.

## చిన్నారులకు పలువురు ఆశీర్వాదం



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో అనంత వెంకటేశ్వరరావు, కళావతి దంపతుల మనువరాలు కుంధానిక, రిషికేష్‌ల ఓణీల పంచకట్టు వేడుక కార్యక్రమంలో పాల్గొన్న బిఆర్ఎస్ జిల్లా నాయకులు కట్టా కృష్ణార్జున్ రావు, 5వ వార్డు కౌన్సిలర్ కట్టా స్వరూపరాణి దంపతులు చిన్నారులను ఆశీర్వదించారు. ఆశీర్వదించిన వారిలో బిఆర్ఎస్ జిల్లా నాయకులు, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు వనమా విశ్వేశ్వరరావు, పెరుమాళ్ళ కృష్ణమూర్తి, నూకల ప్రసాద్, నూకల వాసు, వజినేపల్లి చక్రవర్తి, లాల్‌మహ్మద్ చిన్నారులను ఆశీర్వదించారు.

# ఓట్ల తొలగింపు ప్రక్రియ పారదర్శకంగా జరగాలి



**-రాజకీయ పార్టీల బీఎల్ఏలను భాగస్వామ్యం చేయాలి**
**-మరణించిన, వలస వెళ్లిన వారి ఓట్లనే తొలగించాలి**
**-పాలేరు నియోజకవర్గ ఎన్నికల అధికారి రాజేశ్వరి**

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ఓటర్ల జాబితా నుంచి ఓట్ల తొలగింపు ప్రక్రియ ఎలాంటి పక్షపాతం లేకుండా, అత్యంత నిష్పక్షపాతంగా జరగాలని పాలేరు నియోజకవర్గ ఎన్నికల అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.రాజేశ్వరి స్పష్టం చేశారు. గురువారం నేలకొండపల్లి మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన ఎస్.ఐ.ఆర్ కార్యక్రమాన్ని ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మండల పరిధిలోని రాజేశ్వరపురంలో జరిగిన గ్రామసభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పాలేరు నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న 291 పోలింగ్ బూత్‌లలో అన్ని రాజకీయ పార్టీలు తమ బూత్ లెవెల్ ఏజెంట్లను తప్పనిసరిగా భాగస్వామ్యం చేయాలని ఆమె సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలోనే ఓట్ల సవరణ ప్రక్రియ సజావుగా సాగుతుందన్నారు. ఓట్ల తొలగింపులో ఎలాంటి స్వార్థపూరిత చర్యలకు తావుండకూడదని, కేవలం మరణించిన వారు మరియు శాశ్వతంగా వేరే ప్రాంతాలకు వలస వెళ్లిన (పర్మనెంట్ షిఫ్టింగ్) వారి ఓట్లను మాత్రమే నిబంధనల ప్రకారం తొలగించాలని బీఎల్ఓలను ఆదేశించారు. రాబోయే సవరణల ప్రకారం అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాల వయస్సు నిండే ప్రతి ఒక్కరూ కొత్త ఓటరుగా దరఖాస్తు చేసుకోవాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పిలుపునిచ్చారు. ఓటర్ల సర్వే కోసం ఇంటింటికీ వచ్చే బూత్ లెవెల్ అధికారులకు ప్రజలు పూర్తి సమాచారం అందిస్తూ సహకరించాలన్నారు. ఓట్ల చేర్పులు, మార్పులు మరియు తొలగింపులపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే సంబంధిత ఫారాల ద్వారా అధికారుల దృష్టికి తీసుకురావచ్చని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి తహసీల్దార్ పి. రాంప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ కనకం నరసింహారావు, రెవిన్యూ ఇన్స్పెక్టర్ అల్లం రవికుమార్, స్థానిక సర్పంచ్ దండా రంగయ్య, ఉపసర్పంచ్ రాసాల నవీన్ యాదవ్, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

# కమ్యూనిస్టులపై పవన్ వ్యాఖ్యలు అజ్ఞానానికి పరాకాష్ట



**ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనాథ్ రెడ్డి**

**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** 2019 ఎన్నికల్లో సొంతంగా గెలిచే రాజకీయ బలం లేక కమ్యూనిస్టుల వెంటా తిరిగిన పవన్ కళ్యాణ్‌కు, నేడు వారు శత్రువులుగా కనిపిస్తున్నారా..? అంటూ జనసేన అధినేత అవకాశవాద రాజకీయాలపై ఏఐవైఎఫ్ ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి మామిండ్ల శ్రీనాథ్ రెడ్డి మండిపడ్డారు. గురువారం మండల కేంద్రం లోని కర్నాటి కృష్ణయ్య భవనం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో యువత నిరుద్యోగంతో నడిరోడ్డున పడుతుంటే, ప్రభుత్వ ఆస్తులను కార్పొరేట్ శక్తులకు తెగనమ్ముతుంటే పాలకుల వైఫల్యాలను ప్రశ్నించడం చేతకాని పవన్, కేవలం పాలకుల మెప్పు కోసమే కమ్యూనిస్టులపై విషం చిమ్ముతున్నారని ధ్వజమెత్తారు. కమ్యూనిస్టుల త్యాగాలపై నోరుపారేసుకుంటే యువత చూస్తూ ఊరుకోదని, పవన్ భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్మికులకు లభించిన 8 గంటల పనిదినం, కనీస వేతనాలు, పేదలకు భూమి దక్కేలా చేసిన భూసంస్కరణలు కమ్యూనిస్టుల పోరాట ఫలితమేనని గుర్తు చేశారు. ప్రజా సమస్యలపై ఒక్క రోజైనా లాఠీ దెబ్బలు తిన్న చరిత్ర లేని పవన్ కళ్యాణ్‌కు త్యాగాల చరిత్రను విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. కమ్యూనిస్టు ఉద్యమాలపై దుష్ప్రచారాన్ని సాగిస్తే ప్రజా క్షేత్రంలో పవన్ కళ్యాణ్‌ను నిలదీసి తగిన బుద్ధి చెబుతామని శ్రీనాథ్ రెడ్డి తీవ్రంగా హెచ్చరించారు. ఈ సమావేశం లో ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మల్లెబోయిన ఉపేందర్, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి పాలపాటి అశోక్, ఏఐవైఎఫ్ మండల నాయకులు ఆలేటి ఉమామహేష్, బాలిన కృష్ణంరాజు, రంజిత్ ఉన్నారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/పాల్వంచ :** ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కొత్తగూడెం మునిసిపల్ కార్పోరేషన్ మేయర్ మూడ్ గణేష్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యావరణలో భాగంగా పాల్వంచలోని4, 5వ, డివిజన్‌లో వార్డ్ సభను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ గణేష్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వం పేద ప్రజల కోసం అందజేస్తున్న పథకాలను అర్హులైన ప్రతీ పేదవారికి అందేలా చూడాలని ఆధికారులను ఆదేశించారు. ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదయలపై స్పంధిస్తూ వార్డ్‌లలో నెలకొన్న సైడ్ డ్రైన్స్, సిసి రహదారులు, నీటి సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని చెప్పారు. కొత్తగూడెం నగర పాలక సంస్థను అన్ని రంగాలలో అభివృద్ధి చేయటానకి కృత నిశ్చయంతో ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి, కార్పోరేటర్ నూకల సరిత, చెరుకు భాగ్యలక్ష్మి, అడిషనల్ కమీషనర్ విజయానంద్, స్పెషలాఫీసర్ ఎల్వి. సత్యనారాయణ, ఎస్ఐ నాగరాజు, జిపిఓ, వార్డు ఆఫీసర్, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.




# హమాలీ కార్మికుల హక్కులను కాపాడుతాం

**- 45మంది ఏఐటియుసీలో చేరిక**



**ప్రజాపక్షం/పాల్వంచ :** ఏఐటియుసీలో చేరిన హమాలి కార్మికుల హక్కులను కాపాడి, వారికి దక్కాల్సిన సంక్షేమ ఫలాలను అందించేందుకు కృషి చేస్తామని ఏఐటియుసి జిల్లా నాయకులు అన్నారపు వెంకటేశ్వర్లు అన్నారు. మండల పరిధి ఉల్వనూర్ దాన్యం కొనుగోలు కేంద్రంలో పని చేస్తున్న 45 మంది కార్మికులు ఏఐటియుసిలో చేరారు. వారందరికి సభ్యత్వాలను గురువారం అందజేశారు. ఈ సంధర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఏఐటియుసిసభ్యత్వం పొందిన ప్రతీ కార్మికుడికి లేబర్ ఇన్సూరెన్స్ కార్డులను, దాన్యం కొనుగోలుదారులు, ప్రభుత్వం నుండి రావాల్సిన న్యాయమైన హక్కులను సాధించే వరకు పోరాటం చేసి వారికి నిరంతరం అండగా ఉంటామని స్పష్టం చేశారు. అనంతరం ఏఐటియుసి అనుబంధ నూతన హమాలి కార్మిక సంఘాన్ని ఏర్పాటు చేశారు. అధ్యక్షులుగా కర్రి వెంకటేష్, కార్యదర్శిగా మహంకాళి క్రిష్ణ, కోశాధికారిగా కాలం సురేష్, ఉపాధ్యక్షులుగా మోట నాగేష్, సహాయ కార్యదర్శిగా తునికి శేఖర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు నిమ్మల రాంబాబు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి వేములపల్లి శ్రీనివాస్, సిపిఐ ఉల్వనూర్ గ్రామ కార్యదర్శి నిట్ట అమృతరావు తదితరులు పాల్గొన్నారు.

# బస్టాండ్‌ను సందర్శించిన ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** నేలకొండపల్లి మండల కేంద్రంలో దీర్ఘకాలంగా నిరుపయోగంగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్‌ను ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి గురువారం ఆకస్మికంగా సందర్శించి, పరిశీలించారు. కోదాడ నుంచి ఖమ్మం వెళ్తున్న మార్గమధ్యంలో ఆయన ఇక్కడి బస్టాండ్‌ను సందర్శించి, క్షేత్రస్థాయి పరిస్థితులను సమీక్షించారు. అధికారులతో బస్టాండ్ భవనం నిరుపయోగంగా మారడానికి గల కారణాలను ఎండీ నాగిరెడ్డి స్థానిక ఆర్టీసీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ప్రయాణికులు బస్సులు ఎక్కడ ఎక్కుతున్నారు..? ఈ బస్టాండ్ వల్ల ప్రజలకు కలిగే ప్రయోజనాలు ఏంటి? దీనిని మళ్లీ పూర్తిస్థాయి వినియోగంలోకి తీసుకురావడానికి ఎలాంటి చర్యలు చేపట్టాలి.? అనే అంశాలపై ఆయన అధికారులతో సుదీర్ఘంగా చర్చించి, వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా అక్కడే ఉన్న పలువురు ప్రయాణికులు ఎండీని కలిసి, బస్టాండ్‌ను త్వరితగతిన పునరుద్ధరించి అందుబాటులోకి తీసుకురావాలని, దీనివల్ల ప్రయాణికులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని విజ్ఞప్తి చేశారు. ఈ ఆకస్మిక తనిఖీ కార్యక్రమంలో ఖమ్మం ఆర్టీసీ మేనేజర్ సరిరామ్, ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి మరియు ఇతర ఆర్టీసీ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# గోదాం నిర్మాణానికి శంకుస్థాపన



**ప్రజాపక్షం/కారేపల్లి:** సింగరేణి మండలంలోని గుట్టికిందగుంపు గ్రామంలో 15వేల మెట్రిక్ టన్నుల సామర్ధ్యం గల గోదాం నిర్మాణానికి రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, వైరా ఎంఎల్ఏ మాలోత్ రాందాస్ నాయక్ శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా రాయల నాగేశ్వరారవు, ఎంఎల్ఏ రాందాస్ నాయక్ మాట్లాడుతూ రైతుల ప్రయోజనాల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం ఆధునిక గిడ్డంగుల నిర్మాణినికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సింగరేణి మండలంలోని గిరిజన రైతాంగానికి ఈ గోదాం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా అమలవుతున్నాయని అన్నారు. అనంతరం వివిధ గ్రామాలకు చెందిన లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో సూడా ఛైర్మన్ దుర్గాప్రసాద్, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో మల్లెల రవీంద్ర ప్రసాద్, సొసైటీ ఛైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు, జిల్లా నాయకులు పగడాల మంజుల, పర్సా పట్టాభిరామారావు, సర్పంచ్ ఉండం రాఘవులు, సొసైటీ డైరెక్టర్ అడ్డగోడ ఐలయ్య, ఏపీఎం వెంకటేశ్వర్లు, ఏఈలు వెంకన్న, నరేందర్, సీఐ సాగర్, ఎస్ఐ బైరు గోపి, సర్పంచుల సంఘం అధ్యక్షులు భూక్య రంజిత్ కుమార్, సర్పంచులు మేదరి వీరప్రతాప్, హీరాలాల్, కిరణ్, హనుమంతు, మృతనాయక్, వడ్డే సులోచన, రాందాస్ నాయక్, భూక్య పద్మ, కాంగ్రెస్ నాయకులు పెద్దబోయిన ఉమాశంకర్, సోషల్ మీడియా ఇంచార్జి వాంకుడోత్ గాంధీ, తదితరులు పాల్గొన్నారు.

# ముంపు సర్వే పారదర్శకంగా నిర్వహించాలి



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** పోలవరం బ్యాక్ వాటర్ ప్రభావంతో భద్రాచలం, బూర్గంపాడు, అశ్వాపురం, మణుగూరు ప్రాంతాల్లో ప్రజలు, రైతులు, పరిశ్రమలు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నందున ముంపు సర్వేను పారదర్శకంగా నిర్వహించి బాధితులకు న్యాయం చేయాలని రాష్ట్ర మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, సిద్దిపేట ఎంఎల్ఏ తన్నీరు హరీష్‌రావు కోరారు. హరీష్ తరపున భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, పినపాక మాజీ ఎంఎల్ఏ రేగా కాంతారావు నేతృత్వంలో బీఆర్ఎస్ నాయకులు గురువారం సారపాక ఐటీసీ అతిథి గృహంలో పోలవరం ప్రాజెక్ట్ ఆథారిటీ(పీపీఏ)బృందానికి వినతి పత్రం అందజేశారు. 2022వ రదల్లో లక్ష మందికిపైగా ప్రజలు ప్రభావితమయ్యారని, రెండు వేల కుటుంబాలు ముంపునకు గురయ్యాయని, ఇప్పటికీ పూర్తి స్థాయి పరిహారం అందలేదని లేఖలో పేర్కొన్నారు. భద్రాచలం వరద రక్షణ కట్టల బలోపేతం, ముంపు బాధితులకు పరిహారం, పునరావాసం, బూర్గంపాడు, సారపాక ప్రాంతాల్లో శాశ్వత రక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో భద్రాచలం నియోజకవర్గ ఇన్‌చార్జ్ మానే రామకృష్ణ, రాష్ట్ర నాయకులు కోటగిరి ప్రభోద్‌కుమార్, రేపాక పూర్ణచందర్‌రావు, బూర్గంపాడు మండల అధ్యక్షులు గోపిరెడ్డి రమణారెడ్డి, సొసైటీ ఛైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్, మాజీ ఎంపీటీసీ వల్లూరిపల్లి వంశీకృష్ణ, మాజీ సర్పంచ్ సిరిపురం స్వప్న, నాయకులు బొల్లు సాంబ, పాటి అశోక్, మేడగం లక్ష్మీ నారాయణరెడ్డి, దారం కృష్ణారెడ్డి, లక్ష్మీ చైతన్యరెడ్డి, ఇసోబు, శ్రీను, అశ్వాపురం మండల అధ్యక్షుడు కోడి అమరేందర్, నాయకులు సూదిరెడ్డి గోపిరెడ్డి, వెన్న అశోక్ కుమార్, డాక్టర్ బాబు, మణుగూరు మండల అధ్యక్షుడు, సొసైటీ ఛైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, నాయకులు యాదగిరి గౌడ్‌తో పాటు నాలుగు మండలాల బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# నైనిశా ఫౌండేషన్ వారి ఆర్థిక వితరణ



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు లోని పైలెట్ కాలనీ కి చెందిన చిన్నాల వెంకటమ్మ అనే మహిళ డయాలసిస్ పేషంట్ ఆర్థిక ఇబ్బందులతో ఉండగా ఈ విషయాన్ని నైనిశా ఫౌండేషన్ వారికి తెలియజేయడంతో వెంటనే స్పందించి నైనిశా ఫౌండేషన్ వారు వారి కుటుంబానికి ఆర్థిక సహాయంగా 5000 రూపాయలు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా నైనిశా ఫౌండేషన్ వారు తెలియజేస్తూ భవిష్యత్తులో ఇలాంటి ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్న బీద కుటుంబాలకు నైనిశా ఫౌండేషన్ అండగా ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మట్టపల్లి సాగర్ యాదవ్, పోదిల వీరబాబు, పాయం ప్రవీణ్, అడ్వకేట్ ఈర్ల రాము, మిట్టపల్లి గోపి, నాగరాజు, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

# దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి : కలెక్టర్



ప్రజాపక్షం/సత్తుపల్లి: ప్రజల నుంచి వచ్చిన అర్హత గల ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం వేగంగా, పారదర్శకంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి నిర్వహించిన రెవెన్యూ సదస్సులో స్వీకరించిన దరఖాస్తులపై గురువారం సత్తుపల్లి తహశీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి దరఖాస్తును అర్హత ఆధారంగా పరిశీలించి, పరిష్కారానికి అర్హమైన వాటిని వెంటనే క్లియర్ చేయాలని సూచించారు. పరిష్కారం సాధ్యం కాని దరఖాస్తుల విషయంలో స్పష్టమైన కారణాలను దరఖాస్తుదారులకు తెలియజేయాలని చెప్పారు. అధికారులు జవాబుదారీతనంతో వ్యవహరించి, ఎటువంటి జాప్యానికి తావివ్వకూడదన్నారు. భూములకు సంబంధించిన అనేక సమస్యలకు రీసర్వే ప్రక్రియ ద్వారా శాశ్వత పరిష్కారం లభించే అవకాశం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. ముఖ్యంగా అటవీరెవెన్యూ భూ సరిహద్దు వివాదాలను జాయింట్ సర్వేల ద్వారా క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. సాదా బైనామా, భూభారతి వంటి భూ సంబంధిత అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి కేసు ఆధారిత పరిష్కార విధానాన్ని అమలు చేయాలని అధికారులకు సూచించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్వయంగా స్వీకరించిన దరఖాస్తుల విషయంలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని, శాఖల మధ్య సమన్వయంతో యుద్ధ ప్రాతిపదికన సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. అవసరమైతే క్షేత్రస్థాయి పరిశీలనలను మరింత వేగవంతం చేయాలని చెప్పారు. అంతకు ముందు కలెక్టర్ వేంసూరు మండలంలోని అమ్మపాలెం గ్రామంలో జరుగుతున్న భూ సర్వే పనులను పరిశీలించి రైతులతో మాట్లాడారు. భూ సర్వే ద్వారా ప్రభుత్వ నిబంధనల మేరకు భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వారికి భరోసా ఇచ్చారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి రాజేందర్, సత్తుపల్లి, వేంసూరు తహశీల్దార్లు, అటవీ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సమున్నత ఆశయాలతోనే భారత జాతీయ మహిళా సమాఖ్య ఆవిర్భావం

**- జిల్లా ప్రధాన కార్యదర్శి మున్నా లక్ష్మీ కుమారి**



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : మహిళలపై నానాటికీ పెరుగుతున్న అత్యా చారాలు, వేదింపులను అరికట్టడంతో పాటు వారి హక్కుల పరిరక్షణకై చట్టాలను పకడ్బందీగా అమలు చేయాల్సిన అవసరం ఉందని భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మన్నా లక్ష్మీ కుమారి అన్నారు. ఆ సమాఖ్య ఆవిర్భావ దినోత్సవం గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయం శేషగిరి భవన్‌లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మున్నా సమాఖ్య జెండాను ఆవిష్కరించిన అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా మహిళా అభ్యునతికి కోసం చేసి న సేవలను నిర్వహించిన బాధ్యతలను గుర్తు చేశారు. నేటి సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడులు, వేదింపులు ఆందోళన కలిగిస్తున్నాయని, మహిళా చట్టాల అమలులో పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ల బిల్లు విషయంలో కేంద్ర ప్రభుత్వం ఇటీవల దొంగాట ఆడిందని, మహిళలను కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే వాడుకుంటుందోని ఆమె తీవ్రంగా ధ్వజమెత్తారు. మహిళలు ఆర్థికంగా, సమాజికంగా, రాజకీయంగా ఎదిగినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని, హక్కుల సాధన కోసం మహిళా లోకమంతా ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పద్మజ, ధనలక్ష్మీ, రత్నకుమారి, గోనె మణి, లక్ష్మీ , మంద నిర్మల, శాంతి, మేదిని లక్ష్మీ , షమీమ్ తదితరతులు పాల్గొన్నారు.

# జేవీఆర్ డిగ్రీ కళాశాల స్వర్ణోత్సవ సన్నాహక సమావేశం

**పూర్వ విద్యార్థులతో ఎమ్మెల్యే రాగమయి, డాక్టర్ మట్టా దయానంద్ సమావేశం**



ప్రజాపక్షం/సత్తుపల్లి: జేవీఆర్ డిగ్రీ కళాశాల స్వర్ణోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు చేపట్టిన సన్నాహక కార్యక్రమాల్లో భాగంగా గురువారం కళాశాలలో పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ ముఖ్య అతిథులుగా, అలాగే కళాశాల పూర్వ విద్యార్థులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సత్తుపల్లిలో జేవీఆర్ డిగ్రీ కళాశాల స్థాపనకు కృషి చేసిన రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి సర్దార్ జలగం వెంగళరావు సేవలను స్మరించుకుంటూ ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విద్యాభివృద్ధి కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. డాక్టర్ మట్టా దయానంద్ మాట్లాడుతూ కళాశాలలో విద్యనభ్యసించిన రోజుల్లో స్నేహితులు, అధ్యాపకులతో గడిపిన మధుర జ్ఞాపకాలను పూర్వ విద్యార్థులతో పంచుకున్నారు. విద్యార్థి దశలో పొందిన అనుభవాలు జీవితంలో ఎంతో ఉపయోగపడ్డాయని అన్నారు. జేవీఆర్ డిగ్రీ కళాశాల స్వర్ణోత్సవ వేడుకలను భారీ విజయవంతం చేయాలని ఎమ్మెల్యే రాగమయి, డాక్టర్ దయానంద్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మట్టా కుటుంబానికి విద్య పట్ల ఉన్న అంకితభావాన్ని ఎమ్మెల్యే రాగమయి గుర్తుచేశారు. కుటుంబ చదువుకొని వైద్యులుగా ఎదిగిన విషయాన్ని ప్రస్తావించారు. అలాగే దివంగత మట్టా ఆరోగ్యమ్మ విద్యా ప్రేమను కొనియాడారు. 60 ఏళ్ల వయస్సు దాటిన తర్వాత కూడా డాక్టరేట్ పట్టా సాధించి ఆదర్శంగా నిలిచిన ఆమె గొప్పతనాన్ని సభికులతో పంచుకున్నారు. సత్తుపల్లి నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని, విద్యాసంస్థలకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని ఎమ్మెల్యే మట్టా రాగమయి హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో జేవీఆర్ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు, ప్రజాప్రతినిధులు, విద్యా సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజాపాలన



ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని వ్యవసాయ మార్కెట్‌లో గురువారం 6,9 వార్డుల గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కాపా చంద్రకళ, వైస్ చైర్మన్ కట్ల సంతోష్, మున్సిపల్ చైర్మన్ రామచంద్రరావు పాల్గొన్నారు. ప్రజల సూచనలను సలహాలను తీసుకొని ప్రజల యొక్క అవసరాలకు అనుగుణంగా వినతులను తీసుకున్నారు. గ్రామసభ వద్ద త్రాగునీటితో పాటు హెల్త్ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మున్సిపాల్ చైర్మన్ డాక్టర్ కాపా చంద్రకళ, వైస్ చైర్మన్ కట్ల సంతోష్ మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని, రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమం ప్రజల మన్ననలను పొందింది అన్నారు. ఎన్నో ఏళ్లుగా ఉన్న సమస్యలను పరిష్కరించడం కోసమే ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందని, ప్రజలు కూడా డ్రైనేజీలను శుభ్రంగా ఉంచుకొని మున్సిపాలిటీలో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చూడాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, హౌసింగ్ ఏఈ కళ్యాన్, సుధీర్, ఏఈవో కీర్తి, జిపివో మస్తాన్, పలువురు రాజకీయ పార్టీ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మోహన్ కుటుంబానికి ఆర్థిక చేయూత



ప్రజాపక్షం/ ఖమ్మం : పోలీస్ శాఖలో వివిధ హోదాల్లో పనిచేసి మరణించిన ఏఆర్ఎస్ఐ వరికూటి మోహన్ కుటుంబానికి ఖమ్మం విశ్రాంత పోలీస్ అధికారుల సంఘం దన్నుగా నిలిచింది. మోహన్ కుటుంబానికి రూ.25వేల ఆర్థిక సా యం అందించింది. ఈ సందర్భంగా సంఘం జి ల్లా అధ్యక్షులు రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ పోలీస్ శాఖలో విశిష్ట సేవలు అందించిన వరికూటి మోహన్ కుటుంబానికి అండగా నిలవడం తమ బాధ్యత అన్నారు. పోలీస్ కుటుంబాల సంక్షేమం కోసం సంఘం పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షులు లావుడ్యా రాములు నాయక్, ప్రధాన కార్యదర్శి రుద్ర వెంకటనారాయణ, కోశాధికారి సోమయ్య, ఉపాధ్యక్షులు సంజీవరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి : కాపా



ప్రజాపక్షం/వైరా: ప్రజాపాలన ప్రగతి కార్యక్రమంలో ప్రభుత్వం ప్రజల అవసరాలను గుర్తించి వారి సమస్యలను పరిష్కరించే అందుకే 99 రోజుల ఈ ప్రణాళికను చేపట్టడం జరిగిందని వైరా మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ గురువారం వైరా మున్సిపాలిటీ పరిధిలోని జరిగిన ప్రజాపాలన ప్రగతి కార్యక్రమం గ్రామసభల్లో మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్, మున్సిపల్ కమీషనర్ ఎం.రామచంద్రరావు, కౌన్సిలర్ మాదినేని సునీతతో పాటు పలువురు కౌన్సిలర్లు అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కాపా చంద్రకళ మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి కార్యక్రమంలో ప్రభుత్వం సమస్యలను పరిష్కరించడం జరిగిందని, పరిష్కారం కాని సమస్యలను కూడా ఈ గ్రామసభల ద్వారా పరిష్కరించడం జరుగుతుందని ఆమె అన్నారు. ముఖ్యంగా ప్రజలు భాగస్వామ్యంతోనే అభివృద్ధి జరుగుతుందని అది గుర్తించాలని తెలిపారు. ప్రజలు ప్రజాప్రతినిధులు కలిస్తేనే అది అభివృద్ధికి నాంది అని, ఇది మన అందరం కలిసి చేయాల్సిన బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఫలితాలు సాధించిన సాయిస్ఫూర్తి విద్యార్థులు

ప్రజాపక్షం/సత్తుపల్లి: జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ (జెఎన్ టియూహెచ్) గురువారం ప్రకటించిన బీటెక్ మూడవ సంవత్సరం ఫైనల్ పరీక్షా ఫలితాల్లో సాయిస్ఫూర్తి అటానమస్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అగ్రస్థానంలో నిలిచారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వూటుకూరి శేషారత్నకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. సీఎస్‌ఈ, ఈసీఈ, ఈఈఈ, సీఎస్‌ఈ (ఏఐ అండ్ ఎంఎల్), ఏఐ అండ్ డీఎస్ విభాగాలకు చెందిన విద్యార్థులు విశిష్టమైన ఎస్‌జీపీఏలు సాధించి కళాశాల ప్రతిష్ఠను మరింత పెంచారన్నారు. సీఎస్‌ఈ విభాగానికి చెందిన షేక్ ఇసుబ్ అలియా, ఏఐ అండ్ డీఎస్ విభాగానికి చెందిన అమరవరపు మాధురి 9.7 ఎస్‌జీపీఏ (92 శాతం) సాధించి అత్యుత్తమ ఫలితాలు నమోదు చేశారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్, రాజ్యసభ సభ్యులు డాక్టర్ బండి పార్థసారథిరెడ్డి, ట్రస్టీ శ్రీమతి బండి అన్విద వర్చువల్‌గా విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను అభినందించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్ రెడ్డి విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో విద్యపై దృష్టి సారించి మరింత ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ పాముల శేఖర్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ యాకూబ్, వివిధ విభాగాధిపతులు ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు

# అటవీశాఖ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు



ప్రజాపక్షం/కల్లూరు: కల్లూరులోని అటవీశాఖ ఆధ్వర్యంలో గురువారం పీఎంశ్రీ ప్రభుత్వ హైస్కూల్ ఆవరణలో వ్యాసరచన మరియు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో 25 మంది బాల బాలికలు పాల్గొని వారి యొక్క శక్తి సామర్థ్యాలను ఉపయోగించి వ్యాసరచన మరియు చిత్రలేఖనం పోటీలలో పాల్గొని వారి యొక్క నైపుణ్యాన్ని ప్రదర్శించారు. అడవుల యొక్క ప్రాధాన్యత అడవులను ఏవిధంగా పెంచుకోవాలి, కాపాడుకోవాలి అనే అంశంపై అవగాహన కల్పించి పరీక్ష పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తల్లాడరేంజి అధికారి బీట్ ఆఫీసర్లు పాల్గొని బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఎఫ్ మనోజ్ అగర్వాల్ ఆదేశాలతో ఎఫ్డిఓ వెంకటేశ్వర్లు, ఉమా, డిప్యూటీ ఆర్ఓ రవికుమార్, సురేష్ కుమార్, తల్లాడ రేంజ్ బీట్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

# జామాయిల్ తోట దగ్ధం



ప్రజాపక్షం/కల్లూరు: కల్లూరులోని ఎల్లంకి ఎస్టేట్ సమీపంలో 10 ఎకరాలలో ఉన్న జామాయిల్ తోట గురువారం మధ్యాహ్న సమయంలో ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని పూర్తిగా దగ్ధమైంది. మద్దినేని రాధాకృష్ణ, వెంకటయ్య, నరసింహారావు అను ముగ్గురు రైతులకు సంబంధించిన పది ఎకరాలలో జామాయిల్ తోట దగ్ధం కావడంతో రైతులకు 10 ఎకరాలు ఆస్తి నష్టం అయినట్లు రెవెన్యూ శాఖ అధికారులు అంచనా వేశారు. విషయం తెలుసుకున్న కల్లూరు ఎస్సై హరిత, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మున్సిపాలిటీ చైర్మన్ మోహన్ నాయక్, సీనియర్ నాయకులు, పసుమర్తి చందర్రావులు, సత్తుపల్లి అగ్నిమాపక కేంద్రం వారికి సమాచారం అందించి సహాయక చర్యలు అందించారు.